
PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03


నెల్లూరు, 04.10.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 18 పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



## దీక్షాదక్షుడు

- సమైక్యాంధ్ర ఉద్యమంకు ఊపు
- శాంతియుత నిరసనలతో మారిన ఉద్యమరూపు
- 16 నెలల జైలు జీవితం కంటే తెలంగాణ నోట్‌ను ఆమోదిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం తనను బాధించిందన్న జగన్

కొన్నేనిసార్లు అనుభవం కన్నా ఆలోచన గొప్పదనిపిస్తుంది. సానుకూల దృక్పథంతో తీసుకునే ఎటువంటి ఆలోచనైనా సత్ఫలితాలనిస్తుంది. మంచో చెడో ఒక నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి వుంటేనే వ్యవస్థయినా, వ్యక్తయినా తమ నమ్మకాన్ని నిలబెట్టుకోగలుగుతారు.

రాష్ట్ర విభజన విషయంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు రెండుకళ్ల సిద్ధాంతాన్ని అనుసరించి అటు తెలంగాణలోను, ఇటు సీమాంధ్రలోనూ ప్రజల విశ్వాసం పోగొట్టుకున్నాడు. ఈరోజు రెండు ప్రాంతాలలోనూ ఆయనను నమ్మే పరిస్థితి లేకుండా పోయింది.

చంద్రబాబు రాజకీయ అనుభవంతో పోలిస్తే వై.యస్.జగన్ కొండముందు బండలాంటివాడు. కాని ఈరోజు చంద్రబాబు అనుభవం కంటే జగన్ ఆలోచనా విధానం రాష్ట్ర రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. చంద్రబాబులా జగన్ రెండుకళ్లు, రెండుదార్లు చూసుకోలేదు. రాష్ట్ర విభజన నిర్ణయం వెలువడిన వెంటనే దానికి నిరసనగా తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల చేత రాజీనామా చేయించారు. తానూ చేసాడు. సమైక్య రాష్ట్రాన్ని అజెండాగా మార్చుకున్నాడు. రాష్ట్ర విభజనకు నిరసనగా జైలులోనే నిరాహారదీక్షకు పూనుకున్నాడు. తన తల్లిని చెల్లిని సమైక్యవాదం వినిపించమని ప్రజల ముందుకు పంపాడు. పార్టీశ్రేణులను సమైక్య ఉద్యమంలోకి దింపాడు. జైలులో వుండగానే అక్టోబర్ 2వతేదీ మహాత్మాగాంధీ జయంతిరోజు నుండి సీమాంధ్రలోని 175అసెంబ్లీ నియోజకవర్గాలలో సమైక్యదీక్షలకు ప్రణాళిక రచించాడు. ప్రతి నియోజకవర్గంలోనూ పార్టీ సమన్వయకర్తలు దీక్షకు కూర్చునేలా ఆదేశాలిచ్చాడు. 175నియోజకవర్గాలలో దీక్షలు మొదలయ్యాయి. సమైక్యాంధ్ర ఉద్యమానికి ఈ దీక్షలు మరింత బలాన్నిస్తున్నాయి. ఇప్పుడు సమైక్యాంధ్ర ఉద్యమంలో ఎన్జీఓలు, వైకాపా శ్రేణులు తప్పితే కాంగ్రెస్, తెలుగుదేశంలు కనిపించడం లేదు. ఆంధ్రరాష్ట్రావతరణ దినమైన నవంబర్ 1వతేదీ వరకు సమైక్య ఉద్యమాలకు జగన్ ప్రణాళిక రచించారు. సమైక్య ఉద్యమంలో ప్రజలతో కలిసి పార్టీ శ్రేణులను ముందుకు నడిపిస్తున్నాడు. ఈ దీక్ష ఉద్యమం ద్వారా పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయగలిగారు.

దోషిగా తేలకుండానే 16నెలలు ఆయన జైలు జీవితం గడిపాడు. జైలు జీవితం ఎలాంటి వారిలోనైనా మార్పు తెస్తుందంటారు. జైలు నుండి వచ్చిన జగన్‌లో (మిగతా 10వ పేజీలో)



## రాష్ట్రాన్ని నరికేసిన...
# రాక్షస జాతి

- టీ-నోట్‌ను ఆమోదించి సీమాంధ్రుల గుండెల మీద తన్నారు
- రాహుల్ ప్రధాని కల కోసం తెలుగుప్రజల కలలను ఛిద్రం చేసారు

కేంద్ర నిర్ణయానికి నిరసనగా రాజీనామాలు చేసిన చిరంజీవి, పల్లంరాజు, కోట సూర్యప్రకాశ్‌రెడ్డి, కావూరు సాంబశివరావు ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, సాయిప్రతాప్, సబ్బం హరి, అనంత వెంకట్రామిరెడ్డి. ఇదే బాటలో మిగిలిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగీ నేతలు

స్వర్గీయ ప్రధాని రాజీవ్‌గాంధీ ఈ దేశానికి మేలు చేసాడోలేదో గాని సీమాంధ్రలోని 13జిల్లాల ప్రజలకు మాత్రం తీరని ద్రోహం చేసాడు. రాజీవ్‌గాంధీ ఇటలీ వెళ్లి సోనియాగాంధీని ప్రేమించి పెళ్ళి చేసుకోకుండా ఏ భారతదేశపు యువతినో వివాహం చేసుకుని వుంటే సీమాంధ్రకు ఈ పరిస్థితి వచ్చివుండేది కాదేమో! ఎందుకంటే సెంటిమెంట్స్, బంధాలు, అనుబంధాలు గురించి తెలియని ఒక విదేశీ వనిత మనసు ఎంత కర్కశంగా వుంటుందో, ఎంత పాషాణంగా వుంటుందో ఈరోజు సోనియా ప్రవర్తనను చూస్తే తెలుస్తుంది.

ముద్దుల కొడుకు రాహుల్‌ను ప్రధానిగా చూడడం కోసం సోనియాగాంధీ రాష్ట్ర విభజన చిచ్చు పెట్టింది. సీమాంధ్రుల గుండెల మీద తన్నుతూ సిడబ్ల్యుసి భేటీలో 10జిల్లాలతో కూడిన తెలంగాణకు అనుకూలంగా తీర్మానం చేయించింది. 60ఏళ్లపాటు సీమాంధ్రులు, తెలంగాణ ప్రజలు కలిసి అభివృద్ధి చేసుకున్న రాజధాని హైదరాబాద్‌ను ఏకపక్షంగా తెలంగాణకు కట్టబెడుతూ సిడబ్ల్యుసీలో తీర్మానం చేయడంతో సీమాంధ్ర ఒక్కసారిగా భగ్గున మండింది.

సీమాంధ్రలోని 13జిల్లాల్లో రెండు నెలలకుపైగా ఉద్యమాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం నెలకొంది. చదువులు సాగడం లేదు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు నడవడం లేదు. ఎక్కడి బస్సులు అక్కడే ఆగిపోయాయి. వేలకోట్లలో ఆర్థిక నష్టం, కేవలం కాంగ్రెస్ అధిష్ఠానం శాడిజంతో తీసుకున్న నిర్ణయం మూలంగానే ఈ నష్టమంతా కూడా! రాష్ట్ర విభజనతో తలెత్తే సమస్యలను ముందుగా ఎలా పరిష్కరిస్తారో చెప్పకుండా గుడ్డిగా తెలంగాణ ప్రకటన చేయడంతోనే సీమాంధ్రలో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. రెండు నెలలకు పైగా సీమాంధ్రలో ఉద్యమాలు జరుగుతుంటే కేంద్రానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. ఇన్ని రోజులుగా ఆందోళనలు (మిగతా 10వ పేజీలో)



### నాడి పట్టాడు...
## మోడీ వెంటపడ్డాడు

ఏ గాలికి ఆ చాప ఎత్తడంలో రాజకీయ నాయకులు ఆరితేరి వుంటారు. ఈ విషయంలో చంద్రబాబు నాలుగు ఆకులు ఎక్కువే చదివాడు. వాతావరణాన్ని బట్టి మాటలు, ఆలోచనలు మార్చడం ఆయనకే చెల్లింది.

2002లో గుజరాత్ అల్లర్ల నేపథ్యంలో సీఎం పదవి నుండి మోడీని తప్పించాలని కోరిన వారిలో చంద్రబాబు ఒకరు. అప్పుడు ఆయన ఆంధ్రా సీఎం. ఎన్డీఏలో భాగస్వామి. గుజరాత్ అల్లర్ల తర్వాత నరేంద్ర మోడీ ముఖమే చూడనంటూ శపథం చేసాడు.

2004 ఎన్నికలలో ఎన్డీఏ ఓడిపోవడం, చంద్రబాబు ఆ కూటమిలో నుండి బయటకు రావడం జరిగింది. బీజేపీతో పొత్తు వల్లే ముస్లింలు దూరమై తాను ఓడిపోయానని ఆయన మొన్నటిదాకా చెప్పుకునేవాడు. వాస్తవానికి చంద్రబాబుతో పొత్తువల్లే 2004ఎన్నికల్లో బీజేపీ నష్టపోయింది.

అయితే ఏ బీజేపీతో పొత్తు వల్ల అయితే తాను ఓడిపోయానని చంద్రబాబు చెప్పుకుంటున్నాడో అదే బీజేపీతో పొత్తు కోసం ఆయన వెంపర్లాడుతున్నాడు. దానికి కారణం జనం నాడి పసిగట్టడమే. మోడీ పట్ల ప్రజలలో సానుకూల ధోరణి వుందని, ప్రధానిగా ఎక్కువమంది ప్రజలు ఆయనను కోరుకుంటున్నారనే (మిగతా 10వ పేజీలో)



### రాహులే...
## దేశానికి సుప్రీం

జైలు శిక్ష పడ్డ ప్రజాప్రతినిధులు వెంటనే పదవులు కోల్పోయేలా సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. కాని అధికార యూపీఏ ఆ తీర్పును పెడచెవిన పెట్టింది.

సుప్రీంతీర్పును సవరిస్తూ దోషులుగా తేలిన ప్రజాప్రతినిధులు వెంటనే పదవులు కోల్పోకుండా వుండేలా రూపొందించిన బిల్లును పార్లమెంటుకు తెచ్చింది. పార్లమెంట్‌లో దానిని తిరస్కరించడంతో ఆర్డినెన్స్‌గా మార్చి రాష్ట్రపతి ఆమోదానికి పంపింది. రాష్ట్రపతి కూడా ఈ ఆర్డినెన్స్‌పై సందేహాలు వ్యక్తం చేసారు. సుప్రీం న్యాయమూర్తులు రాజ్యాంగకోవిదులు. చట్టాల గురించి సమగ్రంగా తెలిసినవాళ్లు. ఇక పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకులు ఎంతో అనుభవజ్ఞులు. కాని వీరందరి మాటలు యూపీఏ పెద్దల చెవికెక్కలేదు. కాని పెద్దగా రాజకీయ అనుభవం లేని రాహుల్‌గాంధీ ఈ ఆర్డినెన్స్‌ను చించి చెత్తబుట్టలో వేయాలనేసరికి కేంద్రానికి ముచ్చెమటలు పట్టాయి. ప్రధాని అమెరికా నుండి రాగానే హడావిడిగా రాష్ట్రపతి నుండి ఆర్డినెన్స్ వెనక్కి తెప్పించుకుని వాటిని చించి చెత్తబుట్టలో పడేసారు. దీన్నిబట్టి అర్థమయ్యేదేంటంటే రాజకీయ పరిపక్వతలేని రాహుల్ మాటకు వున్న విలువ దేశ న్యాయవ్యవస్థకు దిశానిర్దేశం చేసే సుప్రీం కోర్టుకు లేదని... రాహులే ఈ దేశానికి సుప్రీం అని.

## మునిగినా.. తేలినా...

# కాంగ్రెస్ నావలోనే!

- సీమాంధ్ర జిల్లాల్లో కాంగ్రెస్ గల్లంతే
- ఇతర పార్టీలవైపు చూస్తున్న కాంగీ నేతలు
- కాంగ్రెస్‌తోనే జీవితమంటున్న ఆనం బ్రదర్స్



టైటానిక్ లాంటి ఓడ సముద్రంలో పోతూ పెద్దకొండను ఢీకొట్టింది. దానిలో వున్న ప్రయాణీకులు ప్రాణభయంతో ఎవరికి దొరికింది వాళ్లు పట్టుకుని తలోదిక్కుకు పోయారు. ఇంకో గంటలో ఓడ మునిగిపోనుందనుకుంటే ఆ ఓడలో ఎవరన్నా ధైర్యంగా వుంటారా? కాని అలాంటి ధైర్యాన్నే కూడగట్టుకుంటున్నారు ఆనం సోదరులు. సీమాంధ్రలో ఇక కాంగ్రెస్ కనుమరుగయ్యే వాతావరణం కనిపిస్తున్నా ఆ కాంగ్రెస్‌ను వదిలి ఇంకో పార్టీవైపుకు పోయే సమస్యే లేదంటున్నారు.

రాష్ట్ర విభజన ప్రకటనతో సీమాంధ్రలోని 13జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు పెద్ద విలన్‌గా చూస్తున్నారు. 2004, 2009 ఎన్నికలలో కాంగ్రెస్‌కు ఓట్లేసినందుకు తమ చెప్పులతో తమనే కొట్టుకోవాలన్నంత కసితో వున్నారు. రోడ్లమీద కాంగ్రెస్ నాయకులు కనిపిస్తే తరుముతున్నారు. ఈ సమయంలో సోనియా, దిగ్విజయ్, షిండే వంటి కాంగ్రెస్ నాయకులు సీమాంధ్రలో ఎక్కడికొచ్చినా వారికి ప్రజల నుండి ఎంతటి ప్రతిఘటన వస్తుందో చెప్పలేని పరిస్థితి. అసలే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మీద బాగా వ్యతిరేకత వచ్చింది. విభజన ప్రకటన తర్వాత సీమాంధ్రజిల్లాల్లో అయితే కాంగ్రెస్‌ను పూర్తిగా సమాధి చేయాలనేంత పంతంతో ప్రజలున్నారు. ప్రజలలో వచ్చిన మార్పును గమనించే ఈ 13జిల్లాల్లో వున్న కాంగ్రెస్ నాయకులు చొక్కాలు, జెండాలు మార్చే పనిలో వున్నారు. కొందరు తెలుగుదేశం, వైకాపాలవైపు చూస్తుండగా, ఇంకొందరు మాత్రం ఈలోపు కొత్తపార్టీ ఏదన్నా వస్తే దాంట్లో దూరుదామనే ఆలోచనలో వున్నారు. రాజకీయ భవిష్యత్‌పై ఎవరి ఆలోచనలు వాళ్లు చేస్తున్నారు. కౌన్సిలర్ స్థాయి లీడర్ కూడా ఇక కాంగ్రెస్‌లో వుండాలనుకోవడం లేదు. అలా వుండాలనుకోవడం కూడా అమాయకత్వంగా భావిస్తున్నారు.

కాని రాజకీయంగా ఎంతో తెలివైనవాళ్లు, మేధావులు అనిపించుకున్న ఆనం సోదరులు మాత్రం మునిగినా తేలినా కాంగ్రెస్‌ను వదిలిపోయే ప్రశ్నే లేదంటున్నారు. వచ్చే ఎన్నికల్లో తమకు డిపాజిట్లు రాకపోయినా కాంగ్రెస్‌తోనే కలిసి సాగుతామంటున్నారు. సీమాంధ్రలో కనీసం పదేళ్లు, ఎంతలేదనుకున్నా ఐదేళ్లు కాంగ్రెస్‌కు మనుగడ లేదు. ప్రాంతీయపార్టీలు బలపడితే తమిళనాడులో మాదిరిగా కాంగ్రెస్ ఇక్కడ కూడా కనుమరుగైపోవచ్చు. అయినా ఆనం సోదరులు కాంగ్రెస్‌నే అంటిపెట్టుకుని పోవడానికి కారణమేంటి? ఈ దశలో వాళ్లు వైయస్సార్ కాంగ్రెస్‌లోకో, తెలుగుదేశంపార్టీలోకో పోలేరు. జగన్ క్రింద, చంద్రబాబు క్రింద పని (మిగతా 10వ పేజీలో)

## అధినేతల తీరుతో...

# దేశం, కాంగీలలో నిరుత్సాహం

› వైకాపాలో సమరోత్సాహం



రాష్ట్ర విభజన నిర్ణయం, జైలు నుండి జగన్ విడుదల... ఈ రెండు అంశాలు రాజకీయాలపై తీవ్రప్రభావం చూపిస్తున్నాయి.

రాష్ట్రంలోని మూడు ప్రధానపార్టీల నాయకత్వాలు తీసుకున్న నిర్ణయాలు జిల్లాలో ఆ పార్టీల స్థితిగతులనే మారుస్తున్నాయి. రాష్ట్ర విభజనపై కాంగ్రెస్‌పార్టీ తీసుకున్న నిర్ణయం జిల్లాలో ఆ పార్టీ నాయకుల పట్ల శాపంగా మారుతోంది. జిల్లాలో కాంగ్రెస్ జెండా పట్టుకుని ఆ పార్టీ నాయకులు ప్రజల ముందుకెళ్లలేకపోతున్నారు. పార్టీ తరపున ఉద్యమాలు నిర్వహించలేకపోతున్నారు. తమ పార్టీ నాయకులు సోనియా, మన్మోహన్‌సింగ్, రాహుల్‌గాంధీ వంటి నేతల ఫోటోలను ఫ్లెక్సీలలో పెట్టుకోవడానికి భయపడుతున్నారు. ఆ పార్టీ అగ్రనాయకుల వైఖరిమూలంగా జిల్లాలో కాంగ్రెస్ కేడర్ తీవ్ర నిరుత్సాహంతో వుంది. సమైక్యాంధ్ర ఉద్యమంలో ఎక్కడా కాంగ్రెస్ జెండా అనేదే కనిపించడం లేదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా వుందో అంచనా వేయవచ్చు.

ఇక తెలుగుదేశం నాయకులదీ జిల్లాలో ఇదే పరిస్థితి. చంద్రబాబు తెలంగాణకు అనుకూలంగా లేఖ ఇచ్చి వుండడంతో ఆ పార్టీ నాయకులు ప్రజల ముందుకు ధైర్యంగా పోలేని పరిస్థితి. చంద్రబాబు లేఖ ఇవ్వడం వల్లే తెలంగాణ ఇచ్చారనే ప్రచారం జోరుగా వుంది. అసలే జిల్లాలో పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగా వుంది. చంద్రబాబు తెలంగాణకు అనుకూలంగా ఇచ్చిన లేఖ వల్ల మరింతగా దిగజారింది. అయినా కూడా జిల్లాలోని తెలుగుదేశం నాయకులు తమను తాము కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు, సమైక్యాంధ్ర ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. అయినా చంద్రబాబు సమన్యాయం అంటున్నాడు తప్పితే 'జై సమైక్యాంధ్ర' అని అనక పోతుండడంతో ఆ పార్టీ లీడర్లు, కేడర్ నిరుత్సాహానికి గురవుతుంది.

జగన్ బయటకు రావడం జిల్లాలోని వైకాపాకు జీవన్‌టోన్ టానిక్‌లా మారింది. రాగానే ఆయన సమైక్యాంధ్ర అని నినదించడంతో వైకాపా శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది. అసలే ఆ పార్టీ సీమాంధ్ర జిల్లాలలో మంచి (మిగతా 10వ పేజీలో)


# ఏదీ తెంచక... ఏదీ తేల్చక...

## త్రిశంకు స్వర్గంలో రియల్టర్

రాష్ట్ర విభజనను విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, కళాకారులు, వ్యాపారులు... ఇలా అన్ని వర్గాలవారు వ్యతిరేకించారు. సమైక్యాంధ్ర ఉద్యమంలోనూ భాగస్వాములవుతున్నారు. కాని రాష్ట్రం విడిపోతుందంటే, సీమాంధ్రకు కొత్త రాజధాని వస్తుందంటే సంతోషపడ్డవాళ్లు లేకపోలేదు. వాళ్లే నెల్లూరు జిల్లాలోని రియల్టర్లు.

రాష్ట్రంలో హైదరాబాద్, వైజాగ్‌ల తర్వాత రియల్‌ఎస్టేట్ జోరుమీదుండేది నెల్లూరులోనే. ఏదైనా నెల్లూరుజిల్లాలో వేలంవెర్రిగానే వుంటుంది. ఒకడు ఒక వ్యాపారంలో పదిరూపాయలు సంపాదించాడని తెలిస్తే వారం తిరిగే సరికల్లా కనీసం వందమందన్నా అలాంటి వ్యాపారాన్ని మొదలుపెట్టి వుంటారు. రియల్‌ఎస్టేట్ కూడా జిల్లాలో అంత వెర్రిగానే వుంది. డాక్టర్ గాని, డాక్యుమెంట్‌రైటర్ గాని, టీచర్‌గాని, లాయర్‌గాని, వ్యాపారి గాని, ఉద్యోగి గాని... ఎవరు ఏ వృత్తిలో వున్నా దాదాపు 80శాతం మందికి రియల్ ఎస్టేట్ ప్రవృత్తిగా వుంది. ఆ వ్యాపారంతో జనం అంతగా మమేకమైవున్నారు.

కాని గత నాలుగేళ్లుగా రియల్ వ్యాపారం దారుణంగా వుంది. వై.యస్. వుండగా రియల్ వ్యాపారం పరుగులు తీసింది. ఆయన వున్నప్పుడు జిల్లాకు ఎన్నో పరిశ్రమలు ప్రకటించబడ్డాయి, సెజ్‌లు వచ్చాయి. వీటిని చూసుకునే భూముల అమ్మకాలు, కొనుగోళ్లు విపరీతంగా జరిగాయి. భూముల ధరలు ఆకాశాన్నంటాయి. నెల్లూరుజిల్లా పారిశ్రామికంగా ఎక్కడికో పోతుందని వూహించుకుని నెల్లూరులో పెద్దసంఖ్యలో అపార్ట్‌మెంట్లు నిర్మాణం చేపట్టారు. దాదాపు 200కుపైగా అపార్ట్‌మెంట్లు నగరంలో నిర్మాణంలోనూ, కొన్ని పూర్తయ్యి వున్నాయి. వై.యస్. మరణం తర్వాత రియల్ వ్యాపారం ఢమాల్‌మంది. ఇంతవరకు కోలుకోలేదు. కట్టిన అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు 20శాతం కూడా అమ్ముడుపోలేదు. లే అవుట్‌లలో స్థలాలను కొనే నాథుడు లేడు. భూముల కొనుగోళ్లు నిలిచిపోయాయి. తెచ్చిన అప్పుల మీద వడ్డీలు కట్టలేక వ్యాపారులు చస్తున్నారు. జిల్లాలో రియల్టర్లు కోలుకోవాలంటే మళ్లీ ఏదో ఒక సంచలన సందర్భం రావాలి. అలాంటి సందర్భమే రాష్ట్ర విభజన. కేంద్రం (మిగతా 10వ పేజీలో)

## జగన్‌కి బెయిలొచ్చిందని...
# అమెరికాలో ఆనంద సంబరాలు



గతంలో ఏ పార్టీకీ ఏ నాయకుడికీ రానంత క్రేజ్ వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీకి ఆ పార్టీ అధ్యక్షుడు వై.యస్. జగన్‌కి కనపడుతోంది. ఇక్కడ ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌కి బెయిలొచ్చిన సందర్భంగా అక్కడ అమెరికాలో రెండురోజుల పాటు ఆయన అభిమానులు సంబరాలు జరిపారు.

సెప్టెంబర్ 28వ తేదీ శనివారం ఇలినాయిస్‌లోని బ్లూమింటన్ టౌన్‌లో వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీకి చెందిన మూడురంగుల జెండాని తమ కార్లకు తగిలించుకుని "జైజగన్", "జోహార్ రాజన్న", "జై వై.యస్.ఆర్. సి.పి" అంటూ నినాదాలు చేస్తూ కార్ల ర్యాలీని నిర్వహించారు. వింగ్ ఓవర్ క్లబ్ నుండి బయలుదేరిన ఈ ర్యాలీ వెటరన్స్ మెమోరియల్ పార్క్‌వే, ఐర్లాండ్‌గ్రోవ్, ఈస్ట్ ఓక్‌ల్యాండ్ అవెన్యూ, హెర్షీరోడ్ మీదుగా పదకొండు కిలోమీటర్లు సాగి సౌత్‌మెయిన్ స్ట్రీట్ వద్ద ముగిసింది. మిసౌరి నుండి పమ్మి సుబ్బారెడ్డి, కెంటకీ నుండి బొంతు నాగిరెడ్డిల నాయకత్వంలో పలువురు వై.యస్. అభిమానులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గున్నమనేని లింగారెడ్డి, గోలి అంజన్, శివారెడ్డి తదితరుల సారధ్యంలో ఈ కార్ ర్యాలీ జరిగింది.

### సెయింట్‌లూయిస్‌లో...

29వ తేదీ ఆదివారం మిశౌరి రాష్ట్రంలోని సెయింట్‌లూయిస్‌లోని మహాత్మాగాంధీ సెంటర్‌లో జరిగిన సంబరంలో వందలాదిమంది అభిమానులు చిన్నాపెద్ద బేధం లేకుండా పాల్గొని ఆనందడోలికల్లో వూగిపోయారు.

పమ్మి సుబ్బారెడ్డి నాయకత్వంలో జరిగిన అతి భారీర్యాలీ నిర్వహించిన అనంతరం వై.యస్. అభిమానులంతా ఒక్కచోటకు చేరి జగన్ విడుదల వేడుకను జరుపుకున్నారు. 484రోజుల తర్వాత ఎలాంటి మచ్చ లేకుండా కడిగిన ముత్యంలా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మధ్యకు రావడం ఆనందదాయకమని ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు పేర్కొన్నారు. అభినవ నెల్సన్ మండేలాగా జగన్‌ని కీర్తించారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలువురు వై.యస్.ఆర్.సి.పి నాయకులు అమెరికాలో సంబరాలనుద్దేశించి ప్రసంగించారు. కిరణ్ ములుపు, చక్కా రంగా, శ్రీకాంత్ జొన్నల, డాక్టర్ గొండిపల్లి నరశింహారెడ్డి, బొంతు నాగిరెడ్డి, చిరంజీవిరెడ్డి వంటివారు ప్రసంగిస్తూ ఆరోగ్యశ్రీతో పాటు మైనారిటీల సంక్షేమం, వృద్ధుల సంరక్షణ, మహిళల రక్షణ వంటి అంశాలపట్ల డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి చేపట్టిన అపూర్వ పథకాలను ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నటికీ మరువలేరన్నారు. ఖండాంతరాలు దాటి జరుగుతున్న సంబరాలను చూస్తుంటే రానున్న ఎన్నికల్లో వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ కనీవినీ ఎరుగని విజయాన్ని సాధించబోతుందని జోస్యం చెప్పారు.

ఈ వేడుకల్లో చిన్నపిల్లల కోసం అనేక ఆటపాటల కార్యక్రమాలను నిర్వహించారు. కేక్ కట్‌చేసి వేడుక చేసుకున్నారు. మహిళలూ వృద్ధులూ అధికసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

తాటిపర్తి శ్రీనివాస్, దినేష్ బత్తుల, రవి ఉప్పలపాటి, విజయ్‌నాగ ఇందుకూరి, రామకృష్ణ దగ్గుమాటి, సాయి తారపరెడ్డి, శివరామరాజు, మురళిరాజు గొట్టిముక్కల, లింగారెడ్డి గున్నపనేని, శ్రీను దగ్గుమాటి, వెంకట్ కాట్రగడ్డ, నంద పుప్పాల, వంశీరెడ్డి మోపూరు, చందు తారపరెడ్డి, కిరణ్ ములుపూరు, రవికాంత్, విజయకుమార్‌రెడ్డి వేదనపర్తితో పాటు వందలాదిమంది సకుటుంబ సపరివారంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

- సమైక్యదీక్షా పోరు...

# వైకాపా ఉద్యమ హోరు



వెంకటాచలం దీక్షాశిబిరంలో ప్రసంగిస్తున్న కాకాణి



కావలి దీక్షాశిబిరంలో రామిరెడ్డి ప్రతాప్



నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద దీక్షచేపట్టిన కోటంరెడ్డి



నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో దీక్షకు కూర్చున్న అనిల్

సమైక్య రాష్ట్ర సాధన కోసం వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నిరంతర పోరాటానికి నడుం బిగించింది. అక్టోబర్ 2వ గాంధీ జయంతిని పురస్కరించుకుని సీమాంధ్రలోని 175అసెంబ్లీ నియోజకవర్గాలలో ఆమరణ దీక్షలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే నెల్లూరు జిల్లాలోని 10అసెంబ్లీ నియోజకవర్గాలలో పార్టీ సమన్వయ కర్తలు, ముఖ్యనేతలు ఆమరణదీక్షలకు కూర్చున్నారు. సమైక్యాంధ్ర కోసం ఎటువంటి త్యాగాలకైనా సిద్ధమంటూ వైకాపా నేతలు దీక్షలకు పూనుకున్నారు. నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దీక్షకు కూర్చున్నారు. గాంధీబొమ్మ వద్ద నగర నియోజకవర్గ సమన్వయకర్త పి.అనిల్ కుమార్‌యాదవ్ ఆమరణదీక్ష చేపట్టారు. వెంకటగిరిలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సమన్వయకర్త కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కావలి ట్రంకురోడ్డులో గాంధీబొమ్మ వద్ద సమన్వయకర్త రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వెంకటాచలంలో సర్వేపల్లి సమన్వయకర్త, పార్టీ సీఈసి సభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, సూళ్లూరుపేట బస్టాండ్‌సెంటర్‌లో పార్టీ సమన్వయకర్తలు కె.సంజీవయ్య, నెలవలసుబ్రహ్మణ్యం, దబ్బల రాజారెడ్డి, గూడూరు టవర్‌క్లాక్ సెంటర్‌లో పార్టీ సమన్వయకర్తలు పాశం సునీల్‌కుమార్, డాక్టర్ బాలచెన్నయ్య, నార్త్‌రాజుపాళెంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలు దీక్షా శిబిరాలలో కూర్చున్నారు. ఆత్మకూరులో మాత్రం సమనన్వకర్త మేకపాటి గౌతంరెడ్డికి బదులుగా నాయకులు బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి మరికొందరు నాయకులు దీక్ష మొదలుపెట్టారు. ఆయా శిబిరాలకు నాయకులు, ప్రజలు, జగన్ అభిమానులు పెద్దఎత్తున తరలి వచ్చి వారు చేస్తున్న ఆందోళనకు తమ మద్దతు పలుకుతున్నారు.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
- సరికొత్త, ప్రపంచస్థాయి మోడల్స్
- ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్‌సదుపాయము, ఆదివారం షాపు గలదు.

# జిల్లా పరిషత్ సిఈఓగా జితేంద్ర



నెల్లూరు జిల్లా పరిషత్ సిఈఓ(ముఖ్య కార్యనిర్వహణాధికారి)గా మారిశెట్టి జితేంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమండ్రి మునిసిపల్ కమీషనర్‌గా పనిచేసిన ఆయనను ప్రభుత్వ నెల్లూరు జిల్లా పరిషత్ సిఈఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. 1985లో డిప్యూటీ తహశీల్దారుగా విధుల్లో చేరిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. గూడూరు, రాజమండ్రి ఆర్డీవోగా పని చేసారు. బాధ్యతలు చేపట్టిన జితేంద్రకు నెల్లూరు జిల్లా అదనపు జాయింట్ కలెక్టర్ పెంచలరెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

# గాంధీ పుట్టినరోజునా బ్రాందీకంపే!

## డ్రైడే నాడు కూడా మద్యం, మాంసం విక్రయాలు



ప్రపంచ మానవాళి ఆదర్శంగా తీసుకునే శాంతి చిహ్నం మహాత్మా గాంధీ. మద్యం, మాంసం వంటి వాటిని నిషేధించాలని పిలుపునిచ్చాడాయన. భారత దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని శాంతియుతంగా నడిపి సమరంతో సాధించలేని దానిని సహనంతో సాధించవచ్చునని నిరూపించిన అహింసావాది. అంతటి గొప్ప నేతకు మనం ఏం ఇవ్వగలం. సంవత్సరానికి 365రోజుల్లో స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్‌డే, గాంధీ జయంతి... ఈ మూడురోజులను డ్రైడేలుగా పాటిస్తే మిగిలిన 362రోజుల్లో యధేచ్ఛగా మద్యం తాగొచ్చు. కాని మందుబాబులు ఆ మూడు రోజులు కూడా తాగకుండా వుండలేకపోతున్నారు. ఆ మూడురోజులు మద్యం షాపులవాళ్లు కూడా అమ్మకుండా వుండలేకపోతున్నారు.

ఈ నెల 2వ తేదీన గాంధీ జయంతి. ఎక్కడా మద్యం అమ్మకాలు జరక్కూడదు. ఇంగితజ్ఞానం వున్నవాళ్లు తాగకూడదు. కాని గాంధీ జయంతి రోజున జిల్లాలో యధేచ్ఛగా మద్యం అమ్మకాలు జరిగాయి. వైన్‌షాపులు మూసేసినా, ముందురోజే దగ్గర్లోని బంకుల్లో మద్యం సీసాలను తరలించి అక్కడ నుండే అమ్మకాలు సాగించారు. యధాఫలంగా రోడ్లమీద తాగుబోతులు తూలుతూ కనిపించారు.

ఓం
శ్రీ మాత్రేనమ:
శ్రీ జ్వాలాముఖీదేవ్యైనమ:



శ్రీశ్రీశ్రీ జ్వాలాముఖీ అమ్మవారి దేవస్థానము
వరిగొండ గ్రామం, టీ.పి.గూడూరు మండలం, నెల్లూరు జిల్లా.
దేవి శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రిక
తేది 05-10-2013 నుండి 14-10-2013 వరకు

స్వస్తిశ్రీ చాంద్రమాన విజయ నామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ పాఢ్యమి తే 05-10-2013 ది శనివారము నుండి చే 14-10-2013 ది దశమి సోమవారము వరకు దేవిశరన్నవరాత్రి మహోత్సవములు అత్యంత వైభవముగా జరుగును కావున భక్తులెల్లరు విచ్చేసి అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించి అమ్మవారి కృపాకటాక్షములకు పాత్రులు కాగలరని ప్రార్థించుచున్నాము.

:: కార్యక్రమ వివరములు ::

| తేదీ/వారము | కార్యక్రమములు | ఉభయ కర్తలు |
|---|---|---|
| 7-10-13 సోమవారము | ఉ॥గం॥7-00లకు అభిషేకము<br>రా॥గం॥7-00లకు నవావరణపూజ | శ్రీ బత్తల వేణుగోపాలరెడ్డి గారు |
| 8-10-13 మంగళవారము | ఉ॥గం॥7-00లకు అభిషేకము, రా॥ నవావరణపూజ | శ్రీ సిద్ధవరపు రామలింగారెడ్డి గారు<br>శ్రీ అందె సాయిబాబయ్య గారు<br>శ్రీ చెవల శ్రీనివాసులుగారు |
| 9-10-13 బుధవారము | ఉ॥గం॥7-00లకు అభిషేకము, రా॥ నవావరణపూజ | శ్రీ వేమూరి రామమూర్తిగారు |
| 10-10-13 గురువారము | ఉ॥గం॥7-00లకు అభిషేకము, రా॥ నవావరణపూజ | శ్రీ అన్నం రామచంద్రయ్యగారు |
| 11-10-13 శుక్రవారము<br>సరస్వతీ పూజ | ఉ॥గం॥7-00లకు అభిషేకము, రా॥ నవావరణపూజ<br>ఉ॥గం॥9-00లకు సామూహిక అక్షరాభ్యసములు<br>రా॥గం॥ 8-00లకు పాటకచేరి | శ్రీ దొడ్ల గోపాల్‌రెడ్డిగారు |
| 12-10-13 శనివారము<br>దుర్గాష్టమి | ఉ॥గం॥7-00లకు అభిషేకము, రా॥ నవావరణపూజ<br>రా॥గం॥8-00లకు నాదప్రియ ఆర్కెస్ట్రా, పొర్లపల్లి వారిచే భక్తి సంగీత విభావరి | శ్రీ కోట రమేష్‌గారు<br>శ్రీ కందికట్టు మల్లికిరణ్ గారు,<br>వరిగొండ స్వామి |
| 13-10-13 ఆదివారము<br>మహర్నవమి | ఉ॥గం॥7-00లకు అభిషేకము, రా॥ నవావరణపూజ<br>రా॥గం॥8-00లకు భక్తచింతామణి పూర్తి నాటకము లక్ష్మీ చెన్నకేశవ నాట్యమండలి, గండవరం వారిచే | కీ॥శే॥సోమిరెడ్డి రాధాకృష్ణ గారి వారసులు<br>శ్రీ చికిలి రమణారెడ్డిగారు<br>శ్రీ చికిలి శ్రీనివాసులురెడ్డి గారు |
| 14-10-13 సోమవారము<br>విజయదశమి | ఉ॥గం॥7-00లకు అభిషేకము<br>సా॥గం॥4-00లకు పూలంగిసేవ<br>రా॥గం॥7-00లకు కలశోద్వాసన, పారువేట | శ్రీ కామిరెడ్డి చంద్రశేఖరరెడ్డిగారు |





సర్వేపల్లి శాసనసభ్యులు
గౌ॥శ్రీ ఆదాల ప్రభాకరరెడ్డి గారు సహాయ సహకారములతో...
భవదీయులు
శ్రీ సోమన శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తలమండలి ఛైర్మన్
జి.రమణారెడ్డి, కార్యనిర్వాహణాధికారి
కొండ్రెడ్డి రంగారెడ్డి, ఛైర్మన్, విజయడెయిరీ



PDF Compressor Free Version






## దిగ్విజయ్‌కు పిచ్చి

దిగ్విజయ్‌సింగ్ ఒక జాతీయ స్థాయి నాయకుడిగా మాట్లాడడం లేదు. ఒక వీధిరౌడీలాగా మాట్లాడుతున్నాడు. 13జిల్లాల్లో కోట్లాది మంది ప్రజలు ఇబ్బంది పడుతుంటే కనీసం వారి పట్ల సానుకూల దృక్పథంతో ఆలోచించాల్సింది పోయి ఎర్రగడ్డ పిచ్చాసుపత్రిలో పేషంట్ లాగా కారుకూతలు కూస్తున్నాడు. ఇలాంటి నేతలుండబట్టే కాంగ్రెస్ పెద్ద విచ్ఛిన్నకరశక్తిగా తయారౌతుంది.

బి.రాజు, నెల్లూరు.

## బీజేపీ న్యాయం ఇదేనా?

తెలంగాణ విషయంలో కాంగ్రెస్. బీజేపీ దొందూ దొందే అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. తలాతోక లేకుండా కాంగ్రెస్ రాష్ట్ర విభజన చేస్తే బీజేపీ దానికి మద్దతు పలుకుతుండడం విడ్డూరంగావుంది. ఎన్డీఏ హయాంలో మేం మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేసామని చెప్పకుంటున్నారు. ఆ మూడు రాష్ట్రాల ఏర్పాటును ఇంత అధ్వాన్న పరిస్థితుల్లో చేసారా? ఇక్కడ కాంగ్రెస్‌కు, బీజేపీకి తేడా కనిపించడం లేదు. గాడిద, గుర్రం ఒకటైనట్లుగా వుంది.

జి.రాంప్రసాద్, ముత్తుకూరు.

## కొత్త గొర్రెలు

ఈరోజుల్లో క్లోనింగ్, జన్యుమార్పిడి, టెస్ట్‌ట్యూబ్ బేబీలు మొదలైన శాస్త్రీయ పద్ధతుల ద్వారా విశ్వామిత్ర సృష్టి చేస్తున్నారు శాస్త్రవేత్తలు. ఇప్పుడు కాంగ్రెస్ శాస్త్రవేత్తలు 'సమైక్యాంధ్ర-కాంగ్రెస్' అనే కొత్త గొర్రెను సృష్టించారు. (తెలంగాణ శాస్త్రవేత్తలు వేర్పాటువాద కాంగ్రెస్‌పార్టీ అనే కొత్త గొర్రెను సృష్టిస్తారేమో!) విచిత్రమేమిటంటే ఈ కొత్తగొర్రెలు రంగు, ఉన్ని, బరువు, సైజు, ఎత్తులలో పాత గొర్రెకన్నా భిన్నంగా ఉన్నా తోక మాత్రం బెత్తడే! వైకాపాలో వలసలు పోగా మిగిలిన కొత్తగొర్రెలు ఇటలీ కాంగ్రెస్‌లో విలీనమయ్యేవే అని ప్రజలకు బాగా తెలుసు. ఆంధ్రలో వైయస్సార్ కాంగ్రెస్, తెలంగాణలో టీఆర్ఎస్ దాని మిత్రపక్షాలకు ఓట్లు పడతాయి. ఇటలీ కాంగ్రెస్ ఆశించిన ఓట్లు, సీట్లు రావు అగచాట్లు తప్ప! రాహుల్‌కు ప్రధానమంత్రి పదవి ఎండమావే!

కుదుగూరు రంగనాథం, నెల్లూరు.

# 'ప్రభా'తం

భారతదేశ చరిత్రలోనే అత్యంత అవినీతిమయమైన ప్రభుత్వానికి అత్యంత నిజాయితీపరుడైన వ్యక్తి ప్రధానిగా వ్యవహరించడం అరుదైనదిగా చెప్పుకోవచ్చు. పాము ముంగిస మధ్య, పిల్లి, ఎలుక మధ్య సమన్వయం సాధించి స్నేహం సాగించడం కష్టమని అంటుంటారు. కాని యూపీఏ ప్రభుత్వంతో మన్మోహన్‌సింగ్ రాజీపడిన తీరు చూస్తుంటే పిల్లి, ఎలుకల మధ్య సమన్వయం సాధించడం పెద్ద కష్టమేమీ కాదనిపిస్తుంది. అత్యంత అవినీతికరమైన యూపీఏ సర్కార్‌కు ఏ మాత్రం తొణుకు బెణుకు లేకుండా ఈరోజుకూ మన్మోహన్‌సింగ్ నాయకత్వం వహించడం చూస్తుంటే అవినీతితో ఆయన రాజీపడ్డాడా? లేక అవినీతి ఆయనను లోబరచుకుందా? అనేది అర్థంకాని విషయం.

భారతదేశ పరిపాలనావ్యవస్థలో ప్రధానిని మించిన పదవి లేదు. రాజ్యాంగ బద్ధంగా రాష్ట్రపతి హోదా ఎక్కువైనా దానికి రబ్బర్‌స్టాంప్ ముద్ర వుంది. కాని పరిపాలనా పరంగా ప్రధానిదే నెంబర్‌వన్ స్థానం. కాని 2004లో కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రధానిని సైతం శాసించే ఒక పదవి పుట్టుకొచ్చింది. అదే యూపీఏ ఛైర్‌పర్సన్ పోస్ట్. ప్రధాని స్థానంలో మన్మోహన్‌సింగ్ నిమిత్తమాత్రుడు కాగా కీలకమైన పరిపాలనా నిర్ణయాలన్నీ సోనియాగాంధీ కనుసైగలతోనే జరిగాయన్నది నిర్వివాదాంశం. అయితే ఇప్పటివరకు ప్రధానిని మించిన పదవి ఒకటే వుందని, అది యూపీఏ ఛైర్‌పర్సన్ పదవి అని భావిస్తూ వచ్చారు. కాని ఇప్పుడు ప్రధానిని శాసించేది ఒకరు కాదని, ఇద్దరని తేలిపోయింది. ఆ రెండో పవరే కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ. ఆయన కావాలి అంటే కేంద్రం ఆఘమేఘాలమీద ఏమైనా చేస్తుంది. వద్దు అన్నా కూడా అంతే వేగంతో చేస్తుంది. కారాగారశిక్ష పడిన నేరగాళ్లను చట్టసభలలో ప్రవేశించకుండా నిరోధిస్తూ సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పోతే చట్టసభలను నింపడం కష్టం. ఎందుకంటే నేరగాళ్లను నిరోధిస్తే సగానికిపైగా సభలు ఖాళీకావాల్సిందే! అందుకే నేరస్థులు లేని చట్టసభలను కాంగ్రెస్‌వాళ్లు వూహించలేకపోయారు. వారి సంక్షేమం, వారి రాజకీయ భవిష్యత్ కోసం ఆలోచించి జైలుశిక్ష పడ్డంత మాత్రాన పదవులను వదులుకోవాల్సిన అవసరం లేదంటూ పార్లమెంటులో ఓ బిల్లును ఆమోదింపజేయాలనుకున్నారు. ఈ బిల్లుపై 5రోజుల పాటు ఉభయసభలలో చర్చ జరిగింది. ప్రతిపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకించాయి. ఎలాగైనా రాజకీయ నేరస్థులకు రక్షణ కల్పించాలన్న పట్టుదలతో యూపీఏ ఈ బిల్లును ఆర్డినెన్స్ రూపంలోకి మార్చింది. దీనిని రాష్ట్రపతి ఆమోదానికి పంపింది. ఈ ఆర్డినెన్స్‌పై రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీకి కూడా ఆగ్రహం వచ్చింది. ఈ ఆర్డినెన్స్‌పై వివరణ కోసం ఆయన ఇద్దరు కేంద్ర మంత్రులను పిలిపించుకున్నారు. ఆర్డినెన్స్ ఇంకా రాష్ట్రపతి ఆమోదం పొందలేదు. ఈలోపు ప్రధాని మన్మోహన్‌సింగ్ అమెరికా పర్యటనకు వెళ్లారు. ఆయన అమెరికాలో వుండగానే ఇక్కడ ప్రిన్స్ రాహుల్ బాబు అణుబాంబు పేల్చాడు. కేంద్రం చేసిన ఆర్డినెన్స్... పెద్ద నాన్‌సెన్స్... ఇటువంటి వాటిని చించి చెత్తబుట్టలో పారేయాలన్నారు. రాహుల్‌బాబు ఎప్పుడు ఎలాంటి బాంబులు పేలుస్తాడో తెలియని కాంగ్రెస్‌శ్రేణులు ఆయన మాటలతో దిక్కుతోచనిపోయాయి. వెనువెంటనే నష్టనివారణాచర్యలు చేపట్టాయి. రాహుల్ వ్యాఖ్యలు స్వాగతిస్తున్నామని, ఈ ఆర్డినెన్స్‌ను ఇప్పుడే వెనక్కి తీసుకుంటున్నామని ప్రకటించింది. అంటే ఈ మొత్తం ఎపిసోడ్‌లో రాహుల్‌ను హీరోగా చూపించి, ప్రధానిని విలన్‌గా ప్రజలముందు నిలబెట్టే అత్యంత దుర్మార్గపు క్రీడకు కాంగ్రెస్ శ్రీకారం చుట్టింది. రాహుల్‌ను సమర్థుడిగా చూపాలంటే మన్మోహన్‌సింగ్‌పై అసమర్థుడనే ముద్ర వేయాలి. 2009లో యూపీఏ రెండో సారి అధికారంలోకి వచ్చింది మొదలు మన్మోహన్‌సింగ్ ప్రతిష్టను మసకబార్చే చీకటి కుట్రలు కాంగ్రెస్ అధిష్టాన కనుసైగలతో జరుగుతూనేవున్నాయి. 2004-2009ల మధ్య యూపీఏ ప్రభుత్వం ఎంతో సాఫీగా నడిచింది. కాబట్టే 2009లో యూపీఏ మళ్ళీ గెలవగలిగింది. కాని మన్మోహన్‌సింగ్ ఇమేజ్‌తో కాంగ్రెస్ గెలవడం సోనియాకు ఇష్టం లేదు. ఆయన ఇమేజ్‌ను వాడుకుంటే రాహుల్ తెరమరుగవుతాడు. కాబట్టే మన్మోహన్‌ను బలహీనపరిచే ప్రక్రియ మొదలైంది. 2జీ, ఆదర్శ్, బొగ్గుస్కాం... వీటన్నింటిలో ప్రధాని కార్యాలయాన్నే ముద్దాయిగా నిలబెట్టాల్సి వచ్చింది. చివరకు నేరస్థులను రక్షించే ఆర్డినెన్స్ విషయంలో కూడా ప్రధానిదే తప్పు అన్నట్లుగా రాహుల్ వ్యాఖ్యలుండడం నిర్వారపరుస్తుంది. ఎందుకంటే కాంగ్రెస్ అధినేత్రి ప్రమేయం లేకుండా ఇవేవీ జరగవు. కాని నేరం కాంగ్రెస్ చేసి ఆ నెపాన్ని మాత్రం ప్రధానిమీద మోపుతున్నారు. రాహుల్ కోసం మన్మోహన్‌ను చరిత్రహీనుడిగా మారుస్తున్నారు. కాంగ్రెస్‌మార్క్ నీచరాజకీయాలకు మరో బలిపశువు మన్మోహన్‌సింగ్. ఇందులో సందేహం లేదు.



## పాపం... ప్రధాని!

ప్రధాని పదవి నుండి దిగిపోయాక మన్మోహన్‌సింగ్ తన ఆత్మకథను వ్రాసుకుంటూ యూపీఏ హయాంలో తనకు జరిగిన అవమానాలను ఖచ్చితంగా పొందుపరుస్తాడేమో? ప్రధానిగా అయన చేత తప్పలు చేయిస్తున్నది కాంగ్రెస్ అధిష్టానమే! వాటిని ఎత్తిచూపుతున్నది కూడా వాళ్ళే కావడం గమనార్హం.

## 'అంతర్'జాతీయం

- ముంబైలోని డాక్‌యార్డ్‌రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో ఐదంతస్థుల భవనం కుప్పకూలిన దుర్ఘటనలో 50మంది మరణించారు.
- పాకిస్థానీ సాహసబాలిక మలాలా యూసఫ్‌జాయ్‌ని హార్వర్డ్ విశ్వవిద్యాలయం 'పీటర్.జె.గోమ్స్ మానవతా అవార్డు-2013'తో సత్కరించింది.
- ఆహారభద్రత పథకం సమాజంపై గొప్ప ప్రభావం చూపుతుందని రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ అభిప్రాయపడ్డారు. గత నెల 29న ఢిల్లీలో 'ఆదేశిక సూత్రాలు - సమ్మిళిత అభివృద్ధి' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సమాచారహక్కు చట్టం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, ఇతర సంక్షేమ చట్టాలు దేశప్రజలలో సాధికారత సాధనకు దోహదపడ్డాయన్నారు.
- ఫిలిప్పీన్స్‌కు చెందిన మేగన్‌యంగ్ ప్రపంచ సుందరి కిరీటాన్ని చేజిక్కించుకుంది. ఇండోనేషియాలోని బాలిలో నిర్వహించిన 63వ ప్రపంచసుందరి పోటీలలో ఆమె విజేతగా నిలిచింది. 130దేశాలకు చెందిన సుందరీమణులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.
- ఉగ్రవాదం విచారణ పేరిట అమాయకులైన ముస్లిం యువకులను నిర్బంధించవద్దని సూచిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి సుశీల్‌కుమార్ షిండే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు వ్రాసారు. అయితే దీనిని విపక్షాలు తప్పుపట్టాయి. చట్టం అందరికీ సమానమేనని, వచ్చే ఎన్నికలలో ముస్లింల ఓట్ల కోసమే ఈ లేఖ వ్రాసారని బీజేపీ దుయ్యబట్టింది.
- 17ఏళ్లుగా కొనసాగుతున్న బీహార్‌లోని పశుదాణా స్కాం ఓ కొలిక్కి వచ్చింది. ఈ కేసులో సీబీఐ కోర్టు 45మందిని దోషులుగా తేల్చింది. ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌తో పాటు మాజీముఖ్యమంత్రి జగన్నాథ్‌మిశ్రా, జెడి(యు) ఎంపీ జగదీష్‌శర్మ ఇంకా 5మంది రాజకీయనేతలు, నలుగురు ఐఏఎస్ అధికారులు ఈ కేసులో నిందితులుగా వున్నారు.
- బీసీసీఐ అధ్యక్షుడుగా శ్రీనివాసన్ మరో ఏడాది పాటు కొనసాగనున్నారు. ఆదివారం జరిగిన బీసీసీఐ ఏజీఎంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- మధ్యప్రదేశ్‌లోని ఖండ్వా జైలు నుండి ఏడుగురు సిమి కార్యకర్తలు పరారయ్యారు. స్నానపుగదుల గోడలు పగలగొట్టి అడ్డొచ్చిన ఇద్దరు కానిస్టేబుళ్లను కత్తులతో పొడిచి, వారి వద్ద వున్న తుపాకులు, వైర్‌లెస్‌సెట్లు లాక్కుని అంజాద్, అస్లాం, జాకిర్, మెహబూబ్, ఇజాజుద్దీన్, అబుఫైజల్, అబిద్‌మీర్జా అనే ఖైదీలు జైలు నుండి తప్పించుకున్నారు.
- మెడిసిన్ సీట్ల భర్తీ అవినీతి కేసులో కాంగ్రెస్‌పార్టీ రాజ్యసభసభ్యులు రషీద్ మసూద్‌కు ఢిల్లీ సిబిఐ ప్రత్యేకకోర్టు నాలుగేళ్ళ జైలుశిక్ష విధించింది. దీంతో ఆయన తన పార్లమెంటు సభ్యత్వాన్ని కోల్పోనున్నారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- ప్రజలందరికీ ముఖ్యమంత్రిగా వ్యవహరించాలి.
- కిరణ్‌కు దిగ్విజయ్ చురక.

వ్యాఖ్య :- **మీ కేంద్రం మాత్రం తెలంగాణకు మాత్రమే ప్రభుత్వంగా వ్యవహరించాలా?**

వార్త :- సీల్డ్‌కవర్ సీఎం... ఉంటే ఎంత? లేకపోతే ఎంత?
- డిప్యూటీ సీఎం రాజనర్సింహ.

వ్యాఖ్య :- **సీల్డ్‌కవర్ పీఎంకే దిక్కులేదంటారా?**

వార్త :- విభజనతో వచ్చే నష్టాలను అధిష్టానానికి చెప్పాను. - సీఎం కిరణ్.

వ్యాఖ్య :- **విభజన వల్ల వచ్చే సీట్ల గురించి తెలంగాణ నాయకులు చెప్పారు.**

వార్త :- రాహుల్ వైఖరితో ప్రధానికి అవమానం.
- బీజేపీ నేత వెంకయ్యనాయుడు.

వ్యాఖ్య :- **ఇప్పటివరకు జరిగిన అవమానాలతో పోలిస్తే ఇదెంతలే...!**

వార్త :- లౌకిక వాదులతోనే చెలిమి. - వైకాపా అధినేత జగన్.

వ్యాఖ్య :- **ఆ విధంగా సర్టిఫికేట్లు ఎవరైనా పొందివున్నారా?**

వార్త :- 'డ్రీమ్‌టీమ్' కావాలి. - ఢిల్లీ సభలో మోడీ.

వ్యాఖ్య :- **మరీ కలలు ఎక్కువైతే పనిచేసేదెప్పుడు?**

వార్త :- రాష్ట్రాన్ని శ్మశానంగా మారుస్తున్న సోనియా! - సీపీఐ నారాయణ.

వ్యాఖ్య :- **తర్వాత దేశాన్ని టార్గెట్ చేసుకుంటుందేమో చూడండి.**

వార్త :- నా హయాంలో విభజన జరగదు.
- మంత్రులకు స్పష్టం చేసిన కిరణ్.

వ్యాఖ్య :- **త్వరలో సీఎం కుర్చీ దిగుతున్నారన్న మాట.**

వార్త :- భాజపాకు మేం భయపడడం లేదు. - సోనియా.

వ్యాఖ్య :- **ఓన్లీ రాహుల్‌గాంధీకే...**

వార్త :- మా రాజకీయం దేశాన్ని మార్చేందుకే... - జేపీ.

వ్యాఖ్య :- **ఎక్కడ మారుస్తారోననే మిమ్మల్ని ఎదగనీయడం లేదు.**

వార్త :- రాష్ట్రాన్ని, కాంగ్రెస్‌ను రక్షించండి. - రాష్ట్రమంత్రుల పిలుపు.

వ్యాఖ్య :- **హత్యలను ఆపొచ్చుగాని ఆత్మహత్యలను ఆపగలమా?**

వార్త :- రాజీనామా ప్రసక్తేలేదు. - రాహుల్ ఆర్డినెన్స్ వ్యాఖ్యలపై ప్రధాని.

వ్యాఖ్య :- **ఈ ఒక్క విషయం మీదే మీరు గట్టిగా నిలబడ్డారు.**

వార్త :- సమైక్యహామీ ఇస్తేనే విరమణ. - ఉద్యోగసంఘాలు.

వ్యాఖ్య :- **ఐతే సమ్మె ఇప్పట్లో ఆగదన్నమాట!**

PDF Compressor Free Version



## ఎస్పీగారు...
# ప్రైవేట్ దోపిడీని అడ్డుకోండి!


**సమైక్యాంధ్ర సమ్మె అవకాశంగా ప్రైవేటు వాహన యాజమానులు తమ ఇష్టానుసారంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. సమైక్యాంధ్రకు మద్దతుగా ఆర్టీసీ సిబ్బంది సమ్మెబాట పట్టడంతో బస్సులన్నీ గ్యారేజిలకే పరిమితమయ్యాయి. ఒక్క బస్సు కూడా కదలడం లేదు.**

అత్యవసర రాకపోకలకు ఇబ్బందులు ఉండకూడదని ప్రైవేటు బస్సులు, ఆటోలను అనుమతిస్తున్నారు. వారు ఇదే అదునుగా ఇష్టానుసారంగా చార్జీలు పెంచి ప్రయాణీకులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆటోల దోపిడీకి అంతులేకుండాపోతుంది. నెల్లూరు నుంచి 20 నుండి 25 కిలోమీటర్లు ఉన్న వూరుకు వెళ్ళాలంటే ప్రయాణీకుడు రెండు ఆటోలు మారాల్సివస్తోంది. రూ.40/-లు నుంచి రూ.80/-లు వరకు అవుతుంది. నిబంధనలు ఉల్లంఘిస్తూ సిటీ బస్సులు నగరం నుంచి ఇతర ప్రాంతాలకు తిరుగుతున్నాయి. నగరంలో రైల్వేస్టేషన్‌కు వెళ్ళాలంటే ఆటోలో రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారు. ఆటోడ్రైవర్లు ఇష్టానుసారంగా అధిక చార్జీలు వసూలు చేస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఆత్మకూరు బస్టాండ్ నుంచి కావలి, ఆత్మకూరు, ఉదయగిరి తదితర ప్రాంతాలకు ఆటోలు, సిటీ బస్సులు, టెంపోలు, వ్యాన్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రయాణీకుల నుంచి ప్రైవేటు ట్రావెల్స్ ఉదయం ఒకరేటు, సాయంత్రం మరొకటి, రాత్రయితే మూడింతలు చార్జీలు వసూలు చేస్తున్నారు.

నెల్లూరు నుండి తిరుపతికి రూ.106/-లు అయితే రూ.300/-లు, కావలికి రూ.34/-లు అయితే రూ.70/-లు, సీతారామపురంకి రూ.72/-లు అయితే రూ.250/-లు, రాపూరుకి రూ.36/-లు అయితే రూ.150/-లు, ఆత్మకూరుకి రూ.26/-లు అయితే రూ.70/-లు, పొదలకూరుకి రూ.17/-లు అయితే రూ.50/-లు, కలువాయికి రూ.25/-లు అయితే రూ.60/-లు లెక్కన ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఎస్పీగారు ఇప్పటికైనా ఈ దోపిడీని అడ్డుకోండి అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు

**నెల్లూరు నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి**



ప్రయాణీకుల వద్ద నుంచి ఎక్కువ ఛార్జీలు వసూలుచేస్తే కఠినచర్యలు తీసుకుంటామని నెల్లూరు నగర డిఎస్పీ పి.వెంకట నాథ్‌రెడ్డి, ప్రైవేట్ వాహన యజమానులను, ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. ఈ నెల 1న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో ప్రైవేట్ వాహన యజమానులతో, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ సిబ్బంది, వివిధ రంగాల్లోని ఉద్యోగులు జీతాలు సైతం వదులుకుని ఉద్యమంలో పాల్గొంటున్న నేపథ్యంలో ప్రయాణీకుల నుంచి అధిక డబ్బులు వసూలు చేయడం తగదన్నారు. ఇంతకుమునుపు(పాతరేటు) తీసుకుంటున్న టికెట్ రేటునే కొనసాగించాలని సూచించారు. ఇష్టానుసారంగా డబ్బులు వసూలుచేస్తే 100కు ఫోన్ చేయాలని ప్రయాణీకులను కోరారు. ఆటోలకు నంబరు కనిపించే విధంగా రేడియం స్టిక్కర్లుని వినియోగించాలన్నారు. నిబంధనలతిక్రమిస్తే ఆటో సీజ్ చేస్తామన్నారు. ఈ సమావేశంలో నార్త్, సౌత్ ట్రాఫిక్ సిఐలు సురేష్‌కుమార్‌రెడ్డి, సుబ్బారావు, మూడవ, ఆరవ నగర పోలీస్‌స్టేషన్ల సిఐలు కె.వీ.రత్నం, జి.మంగారావు, ట్రాఫిక్ ఎస్సైలు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు చేయూతనివ్వండి

పేద విద్యార్థులను ఆదుకోవడం మన సామాజిక బాధ్యతగా గుర్తించాలని ప్రముఖ గుండెవ్యాధి నిపుణులు డాక్టర్ సి.యస్.శ్రీనివాసరాజు అన్నారు. గురువారం వాత్సల్య-జనహిత భారతీయ విద్యావికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉన్న విద్యార్థులు దేశాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తారని, వారిని గుర్తించి సహకారం అందించాలన్నారు. వాత్సల్య నిరాధార బాలబాలికల చదువుకోసం ఏర్పాటుచేసిన 'చేయూత కార్యక్రమాన్ని' అభినందిస్తూ, సంవత్సరానికి ఒక విద్యార్థికి అయ్యే ఖర్చు రూ॥12,000/-లు అందించారు. ఆ విద్యార్థి చదువు పూర్తై ఉద్యోగం వచ్చే వరకు తన సహాయ సహకారాలుంటాయని డా॥శ్రీనివాసరాజు తెలియజేశారు. పై కార్యక్రమములో జనహిత గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డి, సాంబశివరావు, మధుసూధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహావిష్కరణ

నెల్లూరు స్టాన్‌హౌస్‌పేట పప్పులవీధిలోని ఎడ్లపల్లి వెంకటేశ్వర్లు నగరపాలక ఉన్నత పాఠశాలలో సెప్టెంబరు 30న జేసీస్ ఆధ్వర్యంలో డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని జేసీస్ జోన్-4 ఉపాధ్యక్షులు బాలినేని ఆంజనేయులు ఆవిష్కరించారు. తదుపరి బాలాజీనగర్ వేణుగోపాలస్వామి ప్రాథమిక పాఠశాలకు వాటర్‌ట్యాంక్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా జేసీస్ నెల్లూరు టౌన్ అధ్యక్షులు తవ్వా శ్రీనివాసులు మాట్లాడుతూ వదాన్యులు పేర్ల జనార్థనరావు, బాదం వెంకటనాయుడు సహకారంతో ఈ రెండు కార్యక్రమాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో ముఖ్యదాతలతో పాటు జొన్నగడ్డ రవి కుమార్, రవీంద్ర, శరత్ కుమార్, సతీష్‌కుమార్, జూనియర్ జేసీ ఛైర్మన్ హరికిషన్, జేసీరెట్ ఛైర్‌పర్సన్ తవ్వా యోగవల్లి, సునీతలక్ష్మీ, జోన్‌ఆఫీసర్ చింతాల మధుబాబు, ప్రధానోపాధ్యాయులు తిరుమలరాజు, లక్ష్మయ్య, ఉపాధ్యాయులు సుమన్, వెంకమ్మ, జేసీస్ సంయుక్త కార్యదర్శి రాజకుమార్, జేసీస్ కార్యదర్శి కె.వి.సురేష్‌బాబులు పాల్గొన్నారు.

# బ్యాంక్ టెస్ట్‌లకు ఉచిత శిక్షణ

డిగ్రీ లేదా పీజీ పూర్తిచేసి బ్యాంకు క్లరికల్ గ్రేడ్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్-2013 (IBPS)కు దరఖాస్తు చేసిన బిసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులలో 50 మందికి నెల్లూరు జిల్లా ఏపీస్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని జిల్లా కలెక్టర్, స్టడీసర్కిల్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల 17 నుండి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని 5వ తేదీలోపు దరఖాస్తులు డైరెక్టర్, వెనుకబడిన తరగతుల స్టడీసర్కిల్, 6వ అడ్డ రోడ్డు, పోస్టల్‌కాలనీ, ఎ.కె.నగర్ పోస్టాఫీసు దగ్గర, దర్గామిట్ట, నెల్లూరు చిరునామాకు పంపాలని పేర్కొన్నారు. వివరాలకు 0861-2338300లో సంప్రదించవచ్చు. దరఖాస్తుతో పాటు కులధృవీకరణ పత్రం, ఆదాయధృవీకరణ పత్రం, డిగ్రీ/పీజీ మార్కుల ధృవీకరణపత్రం, నివాసస్థల ధృవీకరణపత్రాలు జతపరచాలన్నారు.

## యువత రక్తదానంపై
# అవగాహన పెంచుకోవాలి

**జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్**

యువత రక్తదానం పై అవగాహన పెంచుకుని రక్త నిల్వలు పెంపొందించాల్సిన అవసరం ఉందని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పేర్కొన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్పందించి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. నెల్లూరు జిల్లా ఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆయా సంఘటనల్లో ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి సకాలంలో రక్తం అందడం లేదని, రక్తదాన శిబిరాలు నిర్వహించిన చిరంజీవి యువత, నేస్తం ఫౌండేషన్, యూత్ ఫౌండేషన్ తదితర స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, స్వచ్ఛంద రక్తదాతలను సత్కరించారు.

స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రదర్శన విఆర్‌సి మైదానం నుండి మద్రాసు బస్టాండ్ మీదుగా రక్తనిధి కేంద్రానికి చేరుకుంది. ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.లక్ష్మి కాంతం, ఏఎస్పీ ఐఆర్ఎస్ మూర్తి, ట్రైనీకలెక్టర్ వర్షిణి, రెడ్ క్రాస్ కన్వీనార్ డా॥ పద్మావతి తదుతరులు పాల్గొన్నారు.

## తెలుగింట్లో పుట్టిన వారందరూ
# తెలుగువారిగా గర్వించాలి

**- ఎస్‌పి బాలు**



కౌశిక్‌బాబును సత్కరిస్తున్న బాలు

తెలుగింట్లో పుట్టిన వారందరూ తెలుగువారిగా ఎంతో గర్వించాలని సినీ గాయకుడు ఎస్‌పి బాల సుబ్రహ్మణ్యం అన్నారు. నెల్లూరు జిల్లా కావలి ఏబియం కాంపౌండ్‌లో బుధవారం రాత్రి జరిగిన బాలసుబ్రహ్మణ్యం ఆర్ట్స్ అండ్ మ్యూజిక్ అకాడమి(బామా) పదవ వార్షికోత్సవ కార్యక్రమంలో బాలు మాట్లాడారు. తెలుగు జాతి గొప్పదనాన్ని నాలుగు దిశలా చాటిచెప్పాలని అదే సమయంలో పరాయి భాషపై విమర్శలు తగవన్నారు. నెల్లూరు జిల్లా వాసినైనందుకు గర్వపడుతున్నానన్నారు. నెల్లూరు జిల్లా నుంచి ఎంతోమంది నిర్మాతలు సినీరంగంలోకి వచ్చారన్నారు. తన పేరుతో అభిమాన సంఘాలు, సంస్థలను నడుపుతామని చాలామంది వస్తున్నారని ఏదైనా కారణంవల్ల ఆ సంస్థ కార్యకలాపాలు ఆగిపోతే తనకు చెడ్డపేరు వస్తుందనే ఉద్దేశంతో వాటి ఏర్పాటుకు ఆసక్తి చూపడం లేదన్నారు. బామా సంస్థకు పదేళ్ళు పూర్తయినా తను రెండు వార్షికోత్సవాలకు మాత్రమే వచ్చినట్లు తెలిపారు. సంస్థ నిర్వాహకులు సాంస్కృతిక కళలపై పుస్తకం రాస్తున్నారని, డాక్టరేట్ రావాలనేదే తన ఆకాంక్షని అన్నారు.

# పెట్రోలుపై కొంత ఊరట

## డీజల్ పై స్వల్ప బాదుడు

మూడు నెలలుగా పెరుగుతూ వచ్చిన పెట్రోలు ధర ప్రస్తుతానికి కొంత మేరకు తగ్గింది. లీటర్‌కు రూ.3.05/- లు తగ్గిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. దీంతో వినియోగదారులకు కొంత ఊరట లభించింది. తగ్గిన పెట్రోల్ ధరతో పాటు రవాణా, వ్యాట్ చార్జీలు కలుపుకుని దాదాపు రూ.4/-లు దాకా లీటర్‌పై తగ్గింది. డీజల్ వినియోగదారుడిపై స్వల్పంగా బాదుడు వేసింది. డిజల్‌పై లీటర్‌కు 50పైసలు పెరగడం రవాణా ఇతర పన్నులు 22.5 శాతం పెరగడంతో మొత్తం 61పైసలు లీటరు డీజల్‌పై పెరిగింది. నెల్లూరులో పెట్రోలు లీటర్ ధర రూ.82-81/-లు నుంచి రూ.78-82/-కు చేరింది. అదే డీజల్ ధర రూ.56.80/- నుంచి రూ.57.41/- కు చేరింది. పెరిగిన ఈ ధరలు సోమవారం అర్ధరాత్రి నుంచి అమలులోనికి వచ్చాయి.

# సీమాంధ్రుడు

**- చిన్ని నారాయణరావు**
**94402 02942**

అతగాడు
అనంతానంత నీరవ నిశ్శబ్దాన్ని
పులుముకొని
ఆకాశాన్ని మోస్తున్నట్లు కొండంత
ధైన్యాన్ని నెత్తికెత్తుకొని
వల్లకాడైన ఊర్లో సమాధులు
మొలకలెత్తితే
ఆ శిథిలాల పరిష్వంగంలోంచి స్ఫూర్తి
నింపుకొని... ఏదో నిర్ణయానికొచ్చినట్లు
చైతన్యాన్ని రాజేసిన అజేయమూర్తిలా
పెద్దపెద్ద అంగలేసుకుంటూ
రుసానును తురిమి పుక్కిట పట్టి
కళ్ళల్లో అగ్గి కణేల్ మన్పిస్తూ
ప్రతిఘటనే ప్రమాణికంగా
ప్రతాపమవుతున్నాడు.
గుండెల్లో రావణాకాష్టం మండించి
తూర్పు తన నిట్టూర్పుకు చిరునామాలా
రంకెలేసి కదంతొక్కే శివుని ముంగిట బసవన్నలా
జటాఝూటంతో తాండవమాచరించే శివయ్యలా
ఏదో కావాలనుకుంటే మరేదో
అయిందనే అంతులేని దుఃఖాన్ని
త్రినేత్రంలో బంధించి
అగ్నిధారల్ని విరజిమ్ముతూ
ముందుకు సాగుతున్నాడు.
తన వెంట ఐక్యతారాగాల
సవ్వడుల్ని రాజేసుకుంటూ
ప్రళయాల్ని విలయాల్ని
తన రహదారులుగా మీటుకుంటూ
వాడు అప్రతిహతంగా ప్రస్థానిస్తూనే ఉన్నాడు
ఎన్నెన్నో సమస్యల అడ్డుగోడల్ని
ఛేదించుకొని
తన జాతి కోసం సర్వం అర్పించే తపం వాడిది
తన భవిత కోసం బలమైన ఆకాంక్ష వాడిది.
రేపటి వెలుగు కోసం పోరాడే పటిమ వాడిది
అనుక్షణం ఉద్యమాన్ని ఆయుధంలా ధరించి
జాతి జాగృతిని కౌగిలించుకొన్న
విప్లవ నరుడాతడు.
రాజకీయ పార్టీల రంగుల హోలీ రంగేళిలో
బ్రతుకుల్ని బలిపీఠం మీద పెట్టినవాడు
పచ్చ పచ్చటి ఆశయాల్ని స్వప్నిస్తూ
వడివడిగా అలజడిగా అడుగులేస్తున్న
కేవలం గొంగళిపురుగు...
రేపటికి సీతాకోకచిలుక కాబోయే
నా ఆంధ్రుడు... అమరజీవి ఆశయ వారసుడు
అసహాయశూరుడైన సీమాంధ్రుడు

# నెల్లూరు కబుర్లు




## రోశయ్య పర్యటన రద్దు

### సమైక్య ఆందోళనల ఫలితం

ఈనెల 6వ తేదీన తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య నెల్లూరుకు రావాల్సివుంది. ఆ విధంగా పర్యటన ఖరారైంది కూడా. 6వ తేదీన నెల్లూరు టౌన్‌హాల్‌లో మాజీశాసనసభ స్పీకర్ అగరాల ఈశ్వరరెడ్డి, మాజీగవర్నర్, మాజీ ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డిపై వ్రాసిన పుస్తకావిష్కరణ సభకు రోశయ్య ముఖ్యఅతిథి. అయితే జిల్లాలో సమైక్యాంధ్ర ఆందోళనలు జరుగుతున్నాయని, రోశయ్య వస్తే ఆందోళనకారులు ఆయనను ముట్టడించే అవకాశాలున్నాయని, భద్రతా కారణాల దృష్ట్యా పర్యటనను వాయిదా వేసుకోవాలని జిల్లా ఎస్పీ వర్తమానం పంపడంతో గవర్నర్ పర్యటన రద్దయ్యింది.

### బాబు ఆత్మయాత్ర

## ఈ నెలలోనే...



చంద్రబాబు ఆత్మగౌరవ యాత్ర జిల్లాలో ఈ నెలలో వుండే అవకాశముంది. ముందుగా అనుకున్న తేదీల ప్రకారమైతే ఇప్పుడు జిల్లాలో జరుగుతుండాలి. కాని ఆయన ఢిల్లీ టూర్, జాతీయ రాజకీయాల చర్చల మూలంగా ఆలస్యమైంది. ఈ నెల 7న ప్రకాశంజిల్లాలో ఆత్మగౌరవ యాత్ర మొదలు పెడుతున్నారు. ప్రకాశం జిల్లాలో ముగిసిన తర్వాత నెల్లూరుజిల్లాలోకి ప్రవేశిస్తారు.



సెప్టెంబర్ 29వ తేదీన మాజీమంత్రి స్వర్గీయ ఆనం వెంకటరెడ్డి జయంతిని పురస్కరించుకుని నెల్లూరు రామలింగాపురం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, పిండి సురేష్, పత్తి రవీంద్రబాబు, కె.ధనుంజయరెడ్డి, వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు.

## పోలీసు కార్యాలయ సిబ్బంది దీక్ష

సోమవారం నెల్లూరులోని ఎన్‌జీఓ భవన్ వద్ద జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది రిలేనిరాహారదీక్ష శిబిరాన్ని ఏపి ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షులు సి.హెచ్.రవీంద్రబాబు ప్రారంభించారు. ఈ దీక్షలో పోలీసు కార్యాలయ సిబ్బంది మాలకొండయ్య, సుబ్రహ్మణ్యం, చంద్ర మేరి, ప్రతాప్, మదన్, సురేంద్ర, అలీఫ్, ఎస్.సుబ్రహ్మణ్యం, వాసు, శ్రీనివాసులు, నరసింహులు, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో సమైక్యాంధ్ర రొట్టెలు

రాష్ట్ర విభజన ప్రక్రియ ఆగిపోవాలని కోరుతూ నెల్లూరులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు సోమవారం చారిత్రాత్మక ఆధ్యాత్మిక కేంద్రమైన బారాషహీద్ దర్గా వద్ద చెరువులో రొట్టెలు వదిలారు. ఈ కార్యక్రమంలో సమైక్యాంధ్ర జేఏసీ నాయకులు సి.హెచ్.పెంచలరెడ్డి, బి.రామిరెడ్డి, పి.రవీంద్రబాబు, డిపిటి ప్రసాద్, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

## అర్ధనగ్న ప్రదర్శన

సమైక్యాంధ్ర కోరుతూ జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరులో అర్ధనగ్న ప్రదర్శన జరిగింది. కోర్టు ప్రాంగణం నుండి ప్రారంభమైన ఈ ప్రదర్శన నెహ్రూబొమ్మ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జేఏసీ ఛైర్మెన్ నరసింహరావు, పి.వి.నారాయణరెడ్డి, మాల్యాద్రి, చక్రవర్తి, రాధాకృష్ణ, జానకి ప్రసాద్, అలీ, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

## సీమాంధ్ర ఉద్యమాన్ని గౌరవించండి

తెలంగాణ బిల్లుకు బేషరతుగా మద్దతునిస్తామని సుష్మాస్వరాజ్ ప్రకటించడం సీమాంధ్ర ప్రజల మనోభావాలను గాయపరచిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కాకు విజయలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడతల రమేష్‌లు ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. విభజన జరిగితే సీమాంధ్ర ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటాయని, సీమాంధ్ర ఉద్యమాన్ని గౌరవించాలని వారు కోరారు. విభజన చేయడానికి వీలులేకుండా రాష్ట్రంలో నదీజలాల సమస్య వుంది. విభజన జరిగితే సీమాంధ్రలో 32లక్షల ఎకరాలకు నీళ్లు లేక పొలాలు బీళ్లవుతాయి. 70శాతం ఆదాయం వచ్చే హైదరాబాద్‌ను కోల్పోతే ఉపాధి విషయంలో సీమాంధ్రులకు తీరని అన్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

## కేసీఆర్‌కు బ్రైన్ ఆపరేషన్

### టీఎన్ఎస్ఎఫ్ వినూత్న నిరసన




కేసీఆర్ దిష్టిబొమ్మకు శస్త్ర చికిత్స నిర్వహిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

సీమాంధ్రులను శ్రీలంకలోని రాక్షసులతో పోలుస్తూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా తెలుగునాడు విద్యార్థి సంఘం సోమవారం నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో వినూత్న ప్రదర్శన నిర్వహించింది. మతిస్థిమితం లేకుండా దిగజారి మాట్లాడుతున్న కేసీఆర్‌కు బ్రైన్ ఆపరేషన్ చేసినట్లుగా ప్రదర్శించారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.తిరుమలనాయుడు, ఇతర విద్యార్థి నాయకులు వైద్యబృందంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా తిరుమల నాయుడు మాట్లాడుతూ కేసీఆర్‌కు బ్రైన్ ఆపరేషన్ చేస్తే మెదడులో మట్టి, రాళ్లు వున్నాయని, ఆయన ఆపరేషన్ వికటించి చావడంతో ఆ దిష్టిబొమ్మను తగలేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అమ్మల్లా, హర్షచౌదరి, పి.సాయికిషోర్, మోను, ప్రేమ్‌కుమార్, గగన్ తదితరులు పాల్గొన్నారు.

### ఫిలిం సెన్సార్‌బోర్డ్‌లో

## ప్రమిద శ్రీనివాసులు



కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యులుగా నెల్లూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రమిద శ్రీనివాసులును నియమించారు. తనకు ఈ పదవి రావడానికి కారణమైన ఒంగోలు లోకసభ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## ఎడ్‌సెట్‌లో 108 మంది

నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే ఎడ్‌సెట్ కోసం ఆదివారం 108 మంది విద్యార్థుల తమ ధృవపత్రాలు అందజేసి పేర్లు నమోదు చేసుకున్నారు. గణితానికి సంబంధించి ఒకటవ ర్యాంకు నుంచి 12వేల ర్యాంకు వరకు అభ్యర్థులను పిలవగా 108 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. తొలుత సహాయక కేంద్రాన్ని తిరుపతిలో నిర్వహిస్తున్నట్లు అధికారుల ప్రకటించారు. సమైక్యాంధ్ర ఉద్యమం కారణంగా రవాణా సౌకర్యాలు పూర్తిగా స్తంభించడంతో నెలూరులో ఎడ్‌సెట్ కౌన్సిలింగ్ జరిపేందుకు నిర్ణయించారు.

## నెల్లూరులో ఆగుతున్న సంఘమిత్ర

బెంగుళూరు-పాట్నా సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్(12295-12296) రైలుకు అక్టోబర్ నెల 1వ తేదీ నుంచి నెల్లూరు స్టాపింగ్‌ను రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామానారాయణరెడ్డి ఏర్పాటు చేసారు. ఇప్పటివరకు సంఘమిత్ర రైలుకు నెల్లూరు స్టాపింగ్ లేకపోవడంతో బెంగుళూరుకు వెళ్ళే విద్యార్థులు, వ్యాపారస్థులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి దృష్టికి ఈ విషయన్ని తీసుకెళ్ళి సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌కు నెల్లూరులో స్టాపింగ్‌కు అనుమతి తెచ్చారు. ఈ ఎక్స్‌ప్రెస్, 1వ తేది నుండి పాట్నా నుంచి బెంగుళూరు వెళుతూ మార్గ మధ్యలో ఉదయం 10.30 గంటలకు నెల్లూరు వస్తుంది. బెంగుళూరు నుంచి పాట్నాకు వెళుతూ రాత్రి తిరిగి 7.30 గంటలకు నెల్లూరులో నిలుస్తుంది.

## భగత్‌సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

అమరవీరుడైన సర్దార్ భగత్‌సింగ్ విగ్రహాన్ని ప్రభుత్వం వెంటనే ఏర్పాటుచేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కరీముల్లా డిమాండ్ చేశారు. గత నెల 28న భగత్‌సింగ్ జయంతిని నెల్లూరు సంతపేటలోని సిపిఐ కార్యాలయం వద్ద అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు శీనయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, నగర అధ్యక్షుడు ఎస్‌కె మస్తాన్‌షరీఫ్, కార్యదర్శి వి.నాగేంద్రబాబు, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## చిల్డ్రన్స్ పార్క్ వద్ద ఆక్రమాలు తొలగింపు

నెల్లూరు నగరం చిల్డ్రన్స్ పార్క్ వద్ద ప్రధాన రహదారి పై నిబంధనలకు విరుద్ధంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను తొలగించారు. పది దుకాణాలకు పైగా వున్న వాటిని మునిసిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ ఆధ్వర్యంలో అక్రమంగా ఉన్న కట్టడాలను తొలగించారు. దీంతో భవన యజమానులకు టౌన్‌ప్లానింగ్ అధికారులకు వాగ్వాదం జరిగింది. బాలాజీ నగర్ పోలీసుల సమక్షంలో అక్రమాలు తొలగించారు.

## అక్రమ వసూళ్ళ నకిలీ విలేకరి అరెస్టు

అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్న నకిలీ విలేకరిని నెల్లూరు నాల్గవ నగర పోలీసులు గతనెల 28న అరెస్ట్ చేసారు. పోలీసుల కథనం మేరకు నెల్లూరు నగరంలో నవాబుపేట రామచంద్రాపురానికి చెందిన భోగ్యం అజయ్‌కుమార్ కొంత కాలంగా హెచ్‌ఎం టీవీ రిపోర్టర్‌నంటూ అక్రమాలకు పాల్పడుతున్నాడు. ఇసుక మాఫియా పై ప్రత్యేక కథనం చేస్తున్నామని, అడిగినంత నగదు ఇచ్చుకోకపోతే ఆ కథనంలో మీ వాహనాల క్లిప్పింగ్స్‌లు ఉంటాయంటూ ఇసుక ట్రాక్టర్ల యజమానులను బెదిరించి దండుకుంటూ వుండేవాడు. ఈ నేపథ్యంలో అరవిందనగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో మద్దిన ప్రభాకర్ అనే ట్రాక్టర్ యజమానిని బెదిరించి వెయ్యి రూపాయలు వసూలు చేసాడు. విషయం తెలుసుకున్న హెచ్‌ఎం టీవీ స్టాఫ్ రిపోర్టర్ నరశింహులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడి నుండి వివరాలు సేకరించారు. అనంతరం హెచ్‌ఎం టీవీ రిపోర్టర్ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న అజయ్‌కుమార్ పై చర్యలు తీసుకోవాలని నాల్గవ నగర పోలీసులకు ఫిర్యాదు చేసారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని ఆర్టీసీ బస్టాండ్ వద్ద అరెస్ట్ చేసారు.

## హజ్ యాత్రకు 400 మంది



హజ్‌యాత్రకు బయలుదేరిన ముస్లింలు

నెల్లూరు జిల్లా నుంచి హజ్ యాత్రకు 400 మంది ముస్లింలు గతనెల 28న బయలుదేరారు. వీరికి వీడ్కోలు చెప్పేందుకు వారి బంధువులు, స్నేహితులు రైల్వేస్టేషన్‌కు రావడంతో రైల్వే ఫ్లాట్‌ఫాం కిక్కిరిసింది. బయలు దేరిన యాత్రికులకు నెల్లూరురూరల్, నగర ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ హజ్ యాత్రికుల కోసం ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యాలను కల్పించిందన్నారు. హజ్ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకొని క్షేమంగా తిరిగి రావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మతపెద్దలు మౌలానా ఇలియాజ్, షకీల్, బాషాబాబు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




సెప్టెంబర్ 30వ తేదీన నెల్లూరు గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో జరిగిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల సమీక్షాసమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, పక్కన జేసీ బి.లక్ష్మీకాంతం, ఏఎస్పీ వి.ఆర్.యస్ మూర్తి తదితరులు

# ప్రజలకంటే పదవులే ముఖ్యమా!

## ఆనం సోదరులకు తమ్ముడు ప్రశ్న

సింహపురి సమాచారం



విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న ఆనం జయకుమార్‌రెడ్డి

జై ఆంధ్రా ఉద్యమంలోనూ తమ తండ్రి వెంకటరెడ్డి సమైక్య వాదానికి కట్టుబడి పనిచేసారని, ఆ స్ఫూర్తి తన సోదరులైన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిలలో లేకుండా పోయిందని వారి తమ్ముడు ఆనం జయకుమార్‌రెడ్డి ఆరోపించారు. 1వ తేదీ నెల్లూరులోని తన ఇంటి వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసనసభలో తెలంగాణ బిల్లు ఓటింగ్‌కు వచ్చే పరిస్థితే లేనప్పుడు వీళ్లకు మంత్రి, ఎమ్మెల్యే పదవులెందుకని ప్రశ్నించారు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా తన అన్నలిద్దరూ పదవులను పట్టుకుని వేలాడుతున్నారని ధ్వజమెత్తారు. వివేకా సిల్లీ రాజకీయాలు చేస్తూ చిల్లరవేషాలు వేస్తూ తాను సమైక్యవాదినని చెప్పుకుంటున్నారు. ప్రజలు, ఉద్యోగులు సమైక్యాంధ్ర కోసం జీతాలను వదులుకుని ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు చదువులు కోల్పోయారు. వ్యాపారులు ఆర్థికంగా నష్టపోయారు. సమైక్యాంధ్ర కోసం ఇంతమంది ఇన్ని రకాలుగా త్యాగం చేస్తుంటే మరి మన మంత్రి, ఎమ్మెల్యే మాత్రం ఎటువంటి త్యాగం చేయకుండా ప్రజలిచ్చిన పదవులను, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అనుభవిస్తున్నారని ఎద్దేవా చేసారు. తన తండ్రి ఆశయాలకనుగుణంగా సమైక్యాంధ్ర కోసం ఉద్యమిస్తానని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఆయన అనుచరులు ఆర్.శ్రీనివాసరావు, ఏసునాయుడు, శివారెడ్డి, ఆసిఫ్‌పాషా, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### నీళ్లశాఖ ఉద్యోగులకు

# పూండ్ల వెంకురెడ్డి చేయూత



బియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఎస్ఇ కోటేశ్వరరావు

జీతాలొస్తుంటేనే ఎవరి జీవితాలైనా సాఫీగా నడుస్తుంటాయి. అన్ని శాఖల ఉద్యోగులు సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొంటున్నారు. రెండు నెలలుగా వారికి జీతాలు లేవు. మరి జీతాలు లేవని చెప్పి మన కడుపు ఆకలి చంపుకోలేముగా! ఇంట్లో అవసరాలను వాయిదా వేయలేము కదా! ఉద్యోగులలో కొందరికైనా తనవంతు సహకారం అందించడానికి పూండ్ల వెంకురెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ముందుకొచ్చింది. జిల్లాలోని నీటిపారుదల శాఖకు చెందిన ఉద్యోగులకు 10టన్నుల బియ్యాన్ని ఉచితంగా అందజేసింది. నీటిపారుదల శాఖ ఎస్ఇ కోటేశ్వరరావుకు ట్రస్ట్ మేనేజర్ వి.హరినాథ్‌రెడ్డి ఈ బియ్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఇంజనీర్లు బండి సత్యనారాయణ, ఆర్.వెంకటేశ్వర్లు, శివప్రసాద్, ఆర్.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

# వీనులవిందుగా సమైక్యాంధ్ర స్వరయజ్ఞం



ఎన్టీఆర్ స్టైల్లో పాటలు పాడుతున్న ఎమ్మెల్యే వివేకానందరెడ్డి

నెల్లూరు నగరంలో ఏసీబొమ్మ సెంటర్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుండి రాత్రి 10గంటల వరకు 12గంటల పాటు నెల్లూరు జిల్లాలోని వివిధ ఆర్కెస్ట్రా కళాకారులతో స్వరయజ్ఞం కార్యక్రమం వీనుల విందుగా సాగింది. ఈ స్వరయజ్ఞంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పాల్గొని గాయనీగాయకులతో కలిసి సినిమా పాటలు పాడి ప్రేక్షకులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో గాయనీగాయకులు అధికసంఖ్యలో పాల్గొని వివిధ సినిమా పాటలు, సమైక్యాంధ్రపైన ప్రైవేటు గీతాలు పాడి సమైక్యాంధ్రకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆనం వివేకానందరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌ను అందరం కలిసి సాధించుకోవాలన్నారు. హైదారాబాద్ నాదని కెసిఆర్ చెప్పడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, కళాంజలి ఆర్కెస్ట్రా అధినేత శ్రీనివాస్ చక్రవర్తి గాయకులు నాగేంద్ర, రమణయ్య, సురేష్, జాకీర్, జీలు, మధుసూదన్, మనుబోలు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

# గుండె జారితే గల్లంతే...!




సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ శ్రీనివాసరాజు

నెల్లూరు దర్గామిట్టలోని ఏసి.సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 29న వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా గుండెపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో సీనియర్ కార్డియాలజిస్ట్ సి.యస్.శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఎంచుకునే దారి మంచిదైతే గుండె పదిలంగా వుంటుందని, లేకుంటే ఆ కుటుంబం దుస్థితికి కారణమవుతుందని పేర్కొన్నారు. యువత సరదాలకు పోయి చెడు వ్యసనాలకు లోనై శారీరకవ్యాయామాలు లేకుండా గుండె వ్యాధులకు లోనవుతోందని అన్నారు. ధూమపానానికి దూరంగా వుంటూ మధుమేహనియంత్రణ, రక్తపోటును అదుపులో వుంచుకోవడం చేస్తే గుండె పదిలంగా వుంటుందన్నారు. వారంలో 150 నిమిషాలు నడక, రోజుకి 30 నిమిషాలు వ్యాయామం మంచిదని, ఆకుకూరలు, పండ్లు ఆహారంగా తీసుకొంటూ నూనె పదార్థాలు, తీపితినుబండారాలకు దూరంగా వుండడం అవసరమన్నారు.

కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాఘవేంద్రషెట్టి, కార్యదర్శి నలుబోలు బలరామయ్య నాయుడు, కోశాధికారి స్వర్ణ రమేష్ బాబు, సభ్యులు బి.వి.హరికృష్ణ, జి.ఓబులురెడ్డి, పి.రవిచంద్ర, బుర్రా వెంకటేశ్వర్లు, కిలారి తిరుపతినాయుడు, వి.హజరత్‌బాబు, ఏసునాయుడు, బాలసుధాకర్, డా॥కె.అంకిరెడ్డి, డా॥బి.సత్యనాథ్, వి.అరుణచలం, దద్దోలు రమణయ్య, బి.సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.

# "స్మైల్" ఉచిత దంతవైద్య శిబిరం



నెల్లూరులోని స్మైల్ సూపర్‌స్పెషాలిటీ దంతవైద్యశాల గత నెల 29న ముత్తుకూరు మండలం మునునూరు వారిపాళెంలో గల జిల్లా ప్రజాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో ఉచిత దంతవైద్యశిబిరం నిర్వహించింది. దాదాపు 200మందికి దంతవైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, టూత్‌పేస్ట్‌లు, బ్రష్‌లు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా "స్మైల్" అధినేత డాక్టర్ జి.కిరణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు దంత సమస్యలపై అవగాహన కల్పించి, వారికి అవసరమైన సూపర్‌స్పెషాలిటీ దంతవైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరానికి సహాయసహకారాలు అందించిన నెల్లూరుజిల్లా మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ మునుకూరు రవికుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో "స్మైల్" డాక్టర్లు అమూల్య, రీనా, గ్రామ ప్రముఖులు మునునూరు రామ్మోహన్‌రెడ్డి, దువ్వూరు రామసుబ్బారెడ్డి, సిహెచ్ వెంకటశేషారెడ్డి, పట్టపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేపర్ బాయ్స్‌కు జేసీస్ సత్కారం



దినప్రతికలను క్రమం తప్పకుండా ఇంటింటికి ప్రతిదినం అందిస్తున్న పేపర్‌బాయ్స్‌ను సెప్టెంబర్ 30న నెల్లూరులోని జేసీస్ భవన్‌లో జేసీస్ సంస్థ ఘనంగా సన్మానించింది. 30సంవత్సరాలుగా హిందూ పేపర్‌ను అందిస్తున్న వైద్యుల మురళి, ఈనాడు దినపత్రిక అందిస్తున్న మంచికంటి వీరబ్రహ్మం, ఆంధ్రజ్యోతి దినపత్రికను అందిస్తున్న చీతిరాల సురేష్, సాక్షి దినపత్రికను చేరుస్తున్న యాదాల కృష్ణకిషోర్‌లను జేసీస్ సత్కరించి వారి పనితీరును, టైంసెన్స్‌ను కొనియాడింది.

కార్యక్రమంలో జోన్ ఏరియా ఆఫీసర్లు చింతాల మధుబాబు, గుండాలపల్లి మధుసూదన్‌రావు, జేసీస్ ఛైర్‌పర్సన్ తవ్వాయోగవల్లి, జూనియర్ జేసీ ఛైర్మన్ చీతిరాల హరికిషన్, జేసీస్ ప్రెసిడెంట్ తవ్వా శ్రీనివాసులు, కార్యదర్శి కె.వి. సురేష్‌బాబు, సంయుక్త కార్యదర్శి కె.రాజకుమార్‌లు పాల్గొన్నారు.



PDF Compressor Free Version



## కదంబం

### వెలుగు వాకిళ్లు

- అవ్వారు శ్రీధర్‌బాబు
నెల్లూరు. 85001 30770.

బ్రహ్మకు నాలుగు ముఖాలంటారుగా...
నాకు "నాలుగు కళ్లు"ంటేనేం?

"సోడాబుడ్డీ" అని పరిహసిస్తేనేం...!
పచ్చని పైరుని చూసిన
రైతు కళ్ల మెరుపును నాకు దానం చేస్తుంది.
నా చీకటి గుహకు అది వెలుగువాకిలి అవుతుంది

కళ్లకు వాటిని అలంకరించగానే
ప్రపంచమంతా వెలుగుచీర చుట్టుకున్నట్లే...!

చిట్లించుకొని పాకే కనుపాప
ప్రయాణానికి ఆనకట్టే నా కళ్లజోడు

రెప్పల పిట్టల టపటప రెక్కల చప్పుడు
చప్పున ఆపే రిమోట్ కంట్రోల్ అది.

దర్జాగా తన రెండు కాళ్లను
నా చెవుల గట్టుపై ఆనించి
కంటి కొసలోంచి జారిపోయిన
కాంతిని ఒడిసి పట్టుకొని
ప్రసాదాన్ని చేసి కళ్ల కద్దుకోమంటుంది.

చిన్నప్పుడు చెరోచేయి పట్టుకొని
నడిపించిన అమ్మ... నాన్నల్లా...
నా బతుక్కి భవితవ్యాన్నిస్తుంది.
పొరపాటున పడి పగిలితే... నా కళ్లు అనాథలే

అక్షరదాహాన్ని తీర్చే నదీమతల్లిలా
నాతోనే ప్రవహిస్తుంటుంది.

నేను అక్షరాలను తడుముకుంటున్నప్పుడు
నా ముసలి కళ్లకు చేతికర్ర అవుతుంది.

### సింహపురి సాహితీ సమాఖ్య
## నూతన కార్యవర్గం

నెల్లూరు వేదాయపాళెంలోని సాహితీ ఎన్‌క్లేవ్‌లో సెప్టెంబరు 30న "సింహపురి సాహితీ సమాఖ్య" సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యద్దల లలిత గౌరవాధ్యక్షులుగా, గణపంరాజ గోపాల్‌రెడ్డి అధ్యక్షులుగా, సిరిమామిళ్ళ కోటేశ్వరరావు ఉపాధ్యక్షులుగా, గుర్రాల రమణయ్య ప్రధాన కార్యదర్శిగా కావూరి శారద, లలితలు సంయుక్త కార్యదర్శులుగా, అమరా బాలగంగాధరరావు కోశాధికారిగా, సర్వేపల్లి ప్రభాకర్‌రావు, పాలిచర్ల చెంచయ్య, సావిత్రి, పట్టెం వేణుగోపాల్, లావణ్యలు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

## సింహపురిలో శాంతి ర్యాలీ
### --- గాంధీ విగ్రహాలకు విన్నపాలు ---

సమైక్యం కోసం ఉద్యమిస్తూ జాతిపిత గాంధీజీని స్మరిస్తూ బుధవారం సింహపురిలో శాంతిర్యాలీలు, ఎక్కడికక్కడ నిరసనలు, ఆందోళనలు సాగిస్తూ గాంధీ విగ్రహాలకు విన్నపాలు కొనసాగించారు. గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రదర్శనలు చేస్తూ సమైక్య ఆంధ్రప్రదేశ్ కోసం నినాదాలు చేసారు. గాంధీ మార్గంలో హింసకు తావులేకుండా ప్రశాంతంగా కార్యక్రమాలు సాగించారు. రోడ్లపైన వంటావార్పు సాగించారు. నెల్లూరులో ఎన్‌జిఓల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్రబాబు ఆధ్వర్యంలో శాంతి ప్రదర్శనలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్రం విభజన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం ఆగదన్నారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించి గాంధీబొమ్మ వద్ద మానవహారం చేపట్టారు. వైయస్సార్‌సిపి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో దీక్షలు చేపట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అన్ని వర్గాల వారు సమైక్య ఆందోళనలు కొనసాగించారు.

## గల్పిక

# రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచండి

### దిగ్విజయ్‌ని కోరిన కేసీఆర్

అది కరీంనగర్‌లోని కేసీఆర్ ఫామ్‌హౌస్... హైదరాబాద్‌లో జరిగిన సకలజనభేరీ సభలో పాల్గొని ఆయన అప్పుడే ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు. సకలజనభేరి సభ విజయవంతమైన సందర్భంగా అక్కడ పెద్ద దావత్(పార్టీ) ఏర్పాటు చేసారు. ఆ పార్టీలో ఐటంగర్ల్ ముమైత్‌ఖాన్ చేత "ఇప్పటికింకా నా వయసు నిండా పదహారే" వంటి ఐటంపాటలకు డ్యాన్స్‌లు చేయించారు. ముమైత్‌ఖాన్ చిందులు వేస్తుంటే 'పోకిరి' సినిమాలో అలీభాయ్(ప్రకాశ్‌రాజ్)లాగా కేసీఆర్ మందుతాగుతూ తాను పెద్ద డాన్ అన్నట్లుగా ఫోజిచ్చాడు. పార్టీలో ఖుషీ చేసుకున్నాక ఎవరిళ్లకు వాళ్లు పోయారు. కేసీఆర్ మాత్రం అక్కడే ఫామ్‌హౌస్‌లో పడుకుని నిద్రపోయాడు.

బాగా అర్ధరాత్రి దాటింది... కేసీఆర్... కేసీఆర్... అని ఎవరో పిలిచారు. కేసీఆర్‌కు ఎక్కడో చిన్నగా ఆ పిలుపు వినిపించింది. అయినా ఒళ్లు బద్ధకంతో లేవలేదు. ఆ కంఠం మళ్ళీ రెండుసార్లు కేసీఆర్... నాయనా కేసీఆర్ అని పిలిచింది. అయినా కేసీఆర్‌లో చలనం లేదు. ఈసారి కాలితొడలో ఏదో బలంగా గుచ్చుకున్నట్లు అనిపించడంతో కేసీఆర్ 'కెవ్వు'మని పెద్దగా అరుస్తూ అదరగొట్టుకుని లేచాడు. కళ్లు తెరిచిచూస్తే ఆయన తొడలో శూలం గుచ్చుకుని వుంది. ఎదురుగా చూస్తే పరమశివుడు, కేసీఆర్ తనకళ్లను తానే నమ్మలేకపోయాడు. అయినా డౌట్‌కొద్దీ ఎవరో పగటివేషగాడై వుంటాడనుకుని... ఎవరు మీరు అని అడిగాడు. మూర్ఖుడా... నేనెవరో గుర్తుపట్టలేదా? ఈ ముల్లోకాలకు అధిపతిని... పరమశివుడిని అని శివుడు చెప్పాడు. ఏ శివుడు... తెలంగాణలోని వేములవాడ శివయ్యవా, రాయలసీమలోని శ్రీశైలం మల్లయ్యవా? కోస్తాలోని నెల్లూరు మూలాపేట శివయ్యవా? ముందు నువ్వు ఏ ప్రాంతం శివుడివో చెప్పు అని కేసీఆర్ ప్రశ్నించాడు. దాంతో శివుడికి ఇంకోసారి కోపంవచ్చి మళ్ళీ శూలాన్ని గుచ్చాడు. మూర్ఖుడా... నీ ప్రాంతీయతత్వాన్ని, నీ వేర్పాటు జాడ్యాన్ని నాకు కూడా అంటిస్తావా..? మాకు ప్రాంతాలు, రాష్ట్రాలు, దేశాలు అనే భేదం లేదు... ఈ ప్రపంచంలో జీవరాశి అంతా మా సృష్టే. నీలాగా నేనూ ప్రాంతీయాభిమానం చూపిస్తే నీకూ నాకూ తేడా ఏంటిరా? అని శివుడు అన్నాడు. అప్పుడు కేసీఆర్... అసలు నువ్వు ఒరిజినల్ శివుడు అనడానికి గ్యారంటీ ఏముంది? ఐడంటిటీ కార్డు వుందా? ఆధార్ కార్డుందా? సీమాంధ్రవాళ్లు పంపించిన డూప్లికేట్ శివుడివై వుండొచ్చుకదా? అని ప్రశ్నించాడు. అప్పుడు శివుడు కోపంతో... మూర్ఖుడా, ప్రాంతీయతత్వంతో నీకు పైత్యం బాగా ముదిరింది. నన్నే అనుమానిస్తావా.... ఇప్పుడే నీ కళ్లు మూసుకుపోగాక అని శపించాడు. అంతే... ఆ క్షణమే కేసీఆర్‌కు చూపుపోయింది. ఆయన జీవితం చిమ్మచీకటైంది. వచ్చింది ఒరిజినల్ శివుడేనని అప్పటికి తెలిసింది. వెంటనే కేసీఆర్ పశ్చాత్తాపంతో నేలపైపడి శివుడి రెండు కాళ్లు పట్టుకున్నాననుకునే భ్రమతో... స్వామీ మీ కాళ్లు పట్టుకుని వేడుకుంటున్నాను... ఈ అజ్ఞానిని మన్నించు... నాకు చూపును తిరిగి ప్రసాదించు అని కోరాడు. దానికి శివుడు... నువ్వు మూర్ఖుడివే అనుకున్నాను... పెద్ద తింగరోడివి కూడా... నువ్వు పట్టుకున్నది నా కాళ్లు కాదు... నువ్వు పడుకున్న మంచంకోళ్లు అని శివయ్య అన్నాడు. దానికి కేసీఆర్... ఏదో ఒకటి పట్టుకున్నాను కదా స్వామి... అసలే కళ్లు కనిపించడంలేదు... అడ్జస్ట్ చేసుకోండి, నాకు చూపు తెప్పించండి అని ప్రార్థించాడు. శివయ్య మళ్ళీ కేసీఆర్‌కు చూపు తెప్పించాడు. కేసీఆర్‌కు ప్రాణం లేచి వచ్చినంత పనైంది. ఆయనే వుండి... తెలంగాణలో ఇంతమంది నాయకులు వుంటే మీరు నన్నే సెలక్ట్ చేసుకుని సతాయిస్తున్నారెందుకు స్వామీ అని అడిగాడు. ఈరోజు హైదరాబాద్ సభలో నువ్వు మాట్లాడిన మాటలు చూస్తే బాధేసింది. సీమాంధ్ర వాళ్లంత ద్రోహులే అన్నావు... వాళ్లు నా భక్తులే... వాళ్లను అంటే నాకు బాధేయదా? అని శివయ్య అన్నాడు. అప్పుడు కేసీఆర్... భలేవారు స్వామి మీరు... సీమాంధ్ర వాళ్ల మీద మీకెంత ప్రేమ వుందో నాకు అంతకంటే ఎక్కువే వుంది... కిరణ్, జగన్‌లను మించిన సమైక్యవాదిని నేను, తెలంగాణ రావడం నాకిష్టమనుకుంటున్నావా... ఏదో ఆ పేరు చెప్పి ఉద్యమం చేసుకుంటూ నెట్టుకొస్తున్నాను. సీమాంధ్రవాళ్లు హైదరాబాద్‌లో వుండబట్టే నేను ఒకరోజు కూలీకెళ్లినా కోట్లు సంపాదించగలుగుతున్నాను. నా ఉద్యమానికే కాంగ్రెస్ భయపడిపోయి తెలంగాణ ఇస్తుందనుకోలేదు. ఇలా ప్రత్యేకరాష్ట్రం ఇస్తారనుకుంటే అసలు తెలంగాణ ఉద్యమం నడిపేవాణ్ణే కాదు... అని కేసీఆర్ చెప్పాడు. ఆ మాటలకు శివుడు మాయాబజార్ సినిమాలో ఎస్వీ రంగారావులా నవ్వి... పిచ్చి కేసీఆర్... కాంగ్రెస్‌వాళ్లు తెలంగాణ ఇచ్చింది నీ ఉద్యమానికి భయపడి కాదు... వాళ్ల కోసం వాళ్లిచ్చుకున్నారు. ఇప్పుడు నువ్వెళ్లి తెలంగాణ వద్దు... రాష్ట్రాన్ని సమైక్యంగానే వుంచమని అడుగు వింటారేమో? అని శివయ్య అన్నాడు. ఖచ్చితంగా, నేను వద్దంటే తెలంగాణ ఆగిపోవాల్సిందే అని కేసీఆర్ వీరావేశంతో చెప్పాడు. అలాగైతే ట్రైచెయ్ అని శివయ్య ఛాలెంజ్ చేసాడు. కేసీఆర్ అందుకు ఒప్పుకున్నాడు.

★★★★★

ఢిల్లీలోని దిగ్విజయ్‌సింగ్ నివాసం. కేసీఆర్ లోపలకు వెళ్లాడు. శివయ్య ఆయన వెనుకే వున్నాడు. కాకపోతే దిగ్విజయ్‌సింగ్‌కు కనపడడు. కేసీఆర్‌ను చూడగానే దిగ్విజయ్‌సింగ్ ఆహ్వానించి కూర్చోబెట్టాడు. మంచినీళ్లు ఇచ్చాక... ఏంటీ, ఇలా వచ్చారని దిగ్విజయ్ అడిగాడు. దానికి కేసీఆర్... మా రాష్ట్రం తగలబడి, మా ప్రజలు కలహించుకోవడం నేను చూడలేకపోతున్నాను. మాకు తెలంగాణ వద్దు... రాష్ట్రాన్ని సమైక్యంగానే వుంచండి, తెలంగాణ కోసం ఇక మేం ఉద్యమాలు కూడా చేయబోమని అన్నాడు. దానికి దిగ్విజయ్... పిచ్చినా... కేసీఆరో... మేం తెలంగాణ ప్రకటించింది నువ్వు చేసిన బోడి ఉద్యమాలకు భయపడి అనుకున్నావా... నీలాంటోళ్లు కోటిమంది ఆమరణ నిరాహారదీక్షలు చేసినా మేం పట్టించుకోం... లక్షలమంది తమ మెడలకు ఉరితాళ్లు బిగించుకుని తెలంగాణ ఇవ్వకపోతే మేం చస్తామని బెదిరించినా మేం లెక్కచేయం... మాకు ఓట్లు, సీట్లు అవసరమయ్యాయి కాబట్టే తెలంగాణ ఇస్తున్నాం... నువ్వు తెలంగాణ వద్దని ఉద్యమాలు చేసినా, కూడు, నీళ్లు, ఇంకోటి మానేసి నిరాహారదీక్ష చేసినా మేం తెలంగాణ ఇచ్చేది ఇచ్చేదే... నీ దిక్కున్నచోట చెప్పుకోపో... ఇంకోసారి తెలంగాణ వద్దు, సమైక్యరాష్ట్రమే ముద్దు అంటూ వచ్చావో... నీ మీదకు కుక్కల్ని వదులుతా అని హెచ్చరించాడు. ఆ మాటలతో కేసీఆర్ బిత్తరపోయాడు. శివయ్యతో... మీరన్నది నిజమే స్వామి, వీళ్లు మా ప్రాంతం మీద ప్రేమతో కాదు మా ఓట్ల మీద కక్కుర్తితో ఇంత నీచానికి పాల్పడ్డారు. ఇప్పటికి నాకు జ్ఞానోదయమైంది స్వామి అంటూ కేసీఆర్ సెలవు తీసుకుని ఇంటికి బయల్దేరాడు.

## దేవీ శరన్నవరాత్రులు



నెల్లూరు దుర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 39వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 5వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి.

5వ తేదీ చండీ అలంకారము, 6వ తేదీ భవాని అలంకారము, 7వతేదీ శ్రీ గాయత్రి అలంకారము, 9వతేదీ శ్రీ గజలక్ష్మి అలంకారం, 10వ తేదీ శ్రీ సరస్వతి అలంకారము, 11వ తేదీ శ్రీకాళికా అలంకారము, 12వ తేదీ శ్రీదుర్గా అలంకారం, శ్రీ మహిషాసురమర్ధిని అలంకారం, 13వ తేదీ శ్రీ రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద వివిధ రూపాలతో అమ్మవారి ఆర్చీ కటౌట్‌లను ఏర్పాటు చేశారు. విజయదశమి రోజున ఆమ్మవారి నగరోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

## జ్వాలాముఖి దేవస్థానంలో దసరా వేడుకలు



టి.పి.గూడూరు మండలం వరిగొండలోని శ్రీ జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానం నందు ఈ నెల 5వ తేదీ నుండి 14వ తేదీ వరకు విజయదశమి ఉత్సవాలు జరుగనున్నాయి. 5న అభిషేకం, కలశస్థాపన, 6న పూలంగిసేవ, నవావరణపూజ, 7, 8, 9తేదీలలో అభిషేకం, నవావరణపూజ, 11న సామూహిక అక్షరాభిషేకములు, పాటకచేరి, సరస్వతీ పూజ, 12న దుర్గాష్టమి సందర్భంగా భక్తి సంగీత విభావరి, 13న భక్తచింతామణి నాటకం, 14వ తేదీ విజయదశమి రోజున కలశోద్వాసన, పారువేట వంటి కార్యక్రమాలు జరుగనున్నాయి. ఆదేరోజు గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు.

## ఇరుకళలమ్మ శరన్నవరాత్రి మహోత్సవాలు




సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రోత్సవాలు ఈనెల 5 నుండి 13 వరకు వైభవంగా జరుగనున్నాయి. ఇరుకళలమ్మ ఈనెల 5న రాజరాజేశ్వరి అలంకారములో, 6న అన్నపూర్ణగా, 7న గజలక్ష్మిగా, 8న సరస్వతిగా, 9న దుర్గాఅలంకారములో, 10న శ్రీభవానీగా, 11న చండీగా, 12న దుర్గాష్టమి, మహార్నవమి సందర్భంగా లలితగా, మహిషాసురమర్ధినిగా, 13వ తేదీ ఉదయం ఇరుకళల పరమేశ్వరి అలంకారంలో అందరినీ అలరింపజేస్తుంది.

PDF Compressor Free Version



## మేషం



అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము

కుటుంబ, ఆర్థిక వ్యవహారాలను సమర్థవంతంగా చక్కబెట్టగలరు. వృత్తి వ్యాపారాలలో అవిశ్రాంత కృషి, ఆదాయవృద్ధి ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, కొత్త కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు ఆలస్యం కావచ్చును. సమావేశాలు, చర్చలలో మీసూచనలకు గుర్తింపు గౌరవాలు లభిస్తాయి. శుభకార్య ప్రయత్నాలలో ముమ్మరంగా పాల్గొంటారు.


## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి జీవనంలో ఆదాయం పెరుగుతుంది. తీరిక ఉండదు. స్థిరాస్తుల వ్యవహారాలు లావాదేవీలను పరిష్కారం చేస్తారు. దైవ కార్యక్రమాలు, సమావేశాలలో పాల్గొంటారు. దూరప్రయాణాలు నిర్ణయంకాగలవు. కోర్టు కేసులు వాయిదా పడగలవు. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. ఉద్యోగులకు బాధ్యతలలో మార్పులు, వత్తిడిని ఎదుర్కొంటారు.


## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వృత్తి వ్యాపారాలలో మంచి వ్యాపకం, ఆర్థికంగా మెరుగైనస్థితి, ఆదాయవృద్ధి ఉంటుంది. క్రొత్త పథకాలు, నిర్ణయాలతో ముందుకు సాగుతారు. సోదర వర్గానికి మేలు జరుగుతుంది. ప్రభుత్వ అనుమతులు క్రొత్త కాంట్రాక్టులు, ప్రాజెక్టులు ఆలస్యంగా గలవు. స్థిరాస్తుల పై రాబడి ఉండినను స్టాక్ మార్కెట్ నిరుత్సాహ పరుస్తుంది. అధికారుల సహకారం బాగుంటుంది.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తివ్యాపారలలో అభివృద్ధియుండి ఆదాయం పెరుగుతుంది. అయినా ఖర్చులు పెరిగి అదుపు చేయడం కష్టం కాగలదు. ప్రతి నిర్ణయాన్ని శాంతంగా ఆలోచించి తీసుకొనడం మంచిది. స్త్రీల ప్రతిభకు గుర్తింపు గౌరావాలు బాగుంటాయి. పనులు నిదానంగా జరుగుతాయి. బిడ్డలకు ఉద్యోగ విద్యాసౌఖ్యం ఉంది. షేర్లు పెట్టుబడులమీద అవకాశాలు లాభాలుంటాయి.


## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

మీరు చేసే నిర్ణయాలు భవిష్యత్తులో ఉపయోగకరంగా ఉంటాయి. క్రీడాకళా సాంకేతిక రంగాలలో వారికి మంచి అవకాశాలు వస్తాయి. సభలు, సమావేశాలలో మీ సూచనలను ఆమోదిస్తారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి కనిపిస్తుంది. ఆదాయం పెరుగుతుంది. ఆర్థిక లావాదేవీలందు ఇతరుల సలహాలను స్వీకరిస్తారు. నిర్మాణాలు కాంట్రాక్టు పనులు నిదానంగా సాగుతుయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఈవారం అదనంగా ఖర్చులు పైనబడగలవు. భూములు, విలువైన వస్తువుల కొనుగోలు వాయిదా పడగలవు. వృత్తి పరంగా విశ్రాంతి దొరకదు. వ్యాపార వర్గాలకు పురోభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాల మంజూరు ఆలస్యంగాగలవు. ఉద్యోగులు విధినిర్వహణలో పొరపాట్లు లేకుండా చూచుకొనాలి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 04.10.2013 నుండి
తేది. 10.10.2013 వరకు

ఈ వారము మేషంలో కేతువు, మిథునంలో గురువు, సింహంలో కుజుడు, కన్యలో రవి, తులలో శని బుధ రాహువులు, వృశ్చికంలో శుక్రుడు, కన్య, తులవృశ్చిక, ధనుస్సు రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 4 శుక్రవారము మహాలయ అమావాస్య
తేది 5 శనివారము శరన్నవరాత్రులు ప్రారంభము. అమ్మవారి దేవాలయాలలో కలశస్థాపన, తిరుమల బ్రహ్మోత్సవాలు ప్రారంభము.

### ముహూర్తములు

తేది 9 పంచమి బుధవారము ఉదయం గంట 9.00 నుండి గంట 11.00 లోగా వృశ్చిక లగ్నమున వ్యాపార ముహూర్తము.

### భాద్రపదమాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 04 | శుక్ర | అమావాస్య | పూర్తిగ |

### ఆశ్వయుజ శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 05 | శని | పాడ్యమి | రా॥గం. 5.45వ॥ |
| తేది. 06 | ఆది | విదియ | రా॥గం.4.38వ॥ |
| తేది. 07 | సోమ | తదియ | రా॥గం. 3.15వ॥ |
| తేది. 08 | మంగళ | చతుర్థి | రా॥గం. 1.24వ॥ |
| తేది. 09 | బుధ | పంచమి | రా॥గం.11.21వ॥ |
| తేది. 10 | గురు | షష్ఠి | రా॥గం.9.10వ॥ |


## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక వ్యవహారాలలోగాని, కుటుంబ వ్యవహారాలలో గాని ఇబ్బందులు వచ్చే స్థితి ఉన్నది జాగ్రత్త పడాలి. ప్రభుత్వ పరంగా జరగవలసిన పనులు నిలబడిపోగలవు. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. డబ్బుకు ఇబ్బంది లేకున్నను ఆర్థికంగా అసంతృప్తితో ఉంటారు. పనులు నిదానంగా జరగడం వల్ల టెన్షన్ పడుతుంటారు. సేవా కార్యక్రమాలకు సహాయపడతారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

క్రొత్త పెట్టుబడులకు, భాగస్వామ్య వ్యాపారాలకు నిర్ణయాలు తీసుకొనే సమయమిది కాదు. వృత్తి నిర్వహణలో కొంత నిరుత్సాహం ఉంటుంది. మంచి వ్యాపారావకాశాలు చేజారిపోవచ్చును. వ్యాపార వర్గాలకు ఆదాయం తగ్గుతుంది. ఆర్థిక వ్యవహారాలు, సొంత పనులందు ఆటంకాలు ఎదురుకాగలవు. ఉద్యోగులకు మంచి అవకాశాలు దొరకుతాయి. దూరప్రయాణాలుంటాయి.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు పెరిగి ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలందు అనుకూలత ఉంటుంది. ఎటువంటి సమస్యలనైనా ధీటుగా ఎదుర్కొంటారు. ఉద్యోగస్థులకు ఒత్తిడి, పనిభారం ఎక్కువగా ఉంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదాపడగలవు. అనుకోకుండా ప్రముఖులతో పరిచయాలు కలుగుతాయి. రావలసిన బాకీలు కొంత మేరకు లభించగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

స్థిరాస్తుల లావాదేవీలను వాయిదా వేసుకొవడం మంచిది. వాహనాలు నడుపువారు, విద్యుత్, యంత్రాల పనులు చేసేవారు జాగ్రత్తగా వ్యవహరించండి. విలువైన వస్తువులు, డబ్బును జాగ్రత్త పరచుకొనాలి, పోగొట్టుకొనే స్థితి ఉన్నది. అనుకున్న పనులను ఎక్కువ శ్రమతో సాధించుకొంటారు. ఉద్యోగార్థులకు చిన్న అవకాశాలు వచ్చే పరిస్థితులున్నాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థిక నిర్ణయాలు, లౌకిక వ్యవహారాలను దూకుడుగా నిర్వహిస్తారు. బిడ్డల వివాహ ప్రయత్నాలు ఫలించే అవకాశం ఉంది. హామీలు, మధ్య వర్తిత్వాలకు దూరంగా ఉండడటం మంచిది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. రావలసిన బాకీలు కొంత లభించడం జరుగుతుంది. ఆహ్వానాలు, ముఖ్యపత్రాలు నోటీసులు అందుకొంటారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ముఖ్య విషయాలలో సర్దుకొనిపోతూ, అనుకున్న పనులు సాధించుకొంటారు. వ్యాపార వృత్తి రంగాలలో అభివృద్ధికి కొత్త పథకాలు ప్రయత్నాలు ఆచరణలో పెడతారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. రావలసిన బాకీలు పై వసూలులో హామీపొందడం, షేర్లు పై స్వల్ప లాభాలుంటాయి. ఉద్యోగులకు అధికారుల అండదండలు బాగుంటాయి.

# బుచ్చిలో దసరా వేడుకలు



నెల్లూరు జిల్లాలో మండల కేంద్రమైన బుచ్చిరెడ్డిపాళెంలో వున్న కోదండ రామస్వామి ఆలయంలో ఈనెల 5 నుంచి 14 వరకు దసరా ఉత్సవాలు వేడుక చేయనున్నామని దేవస్థాన వ్యవస్థాపకధర్మకర్త దొడ్ల మురళీకృష్ణరెడ్డి తెలిపారు. దశావతార అలంకరణలతో స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారని తెలిపారు. మహర్నవమి, విజయదశమి రోజులలో పట్టాభిషేక అలంకారం విశేషంగా వుంటుందని తెలిపారు. జిల్లాలో తెలుగు సంస్కృతికి, ఆధ్యాత్మికతకు ప్రాచీన ప్రాభవ చిహ్నాలుగా నిలిచే దేవాలయాలలో ఈ ఆలయం ఒకటని ప్రతీతి.

# శభాష్ సిఎం

సమైక్యాంధ్ర కోసం గళం విప్పిన మన ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అభినందనీయుడు, ధైర్యశాలి అని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్ళపల్లి అరుణమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియాగాంధీ, ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలు తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా వున్న ఈ తరుణంలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ధైర్యంగా సమైక్యాంధ్ర ప్రకటన చేయడం, అవసరమైతే సిఎం పదవిని వదులుకుంటానని పేర్కొనడం హర్షించదగ్గ విషయమన్నారు. ముఖ్యమంత్రిలాగా మిగిలిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అందరూ ఒక్క మాటపై నిలబడాలన్నారు.

# తూర్పుఎడవల్లిలో ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ బి.వి.ఎస్.రవిశంకర్

నెల్లూరు జిల్లా తూర్పు ఎడవల్లిలో సెప్టెంబర్ 29న లయన్స్ క్లబ్ నెల్లూరు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసారు. ఈ శిబిరంలో మోడరన్ ఐ ఆసుపత్రి సిబ్బంది దాదాపు 225 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 25మందికి శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. లయన్స్ క్లబ్ నెల్లూరు అధ్యక్షులు బి.వి.ఎస్.రవిశంకర్ 126 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ యం.కాశయ్య 56మందిని పరీక్షించి మందులు అందించారు. కార్యక్రమంలో తూర్పు ఎడవల్లి వాస్తవ్యులు లయన్ ఉండేల నాగిరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కార్యదర్శి లయన్ పి.శ్రీరాములు, ట్రెజరర్ బి.మురళీకృష్ణ, సభ్యులు లయన్స్ పి.అంజనేయులు, యం.మారుతి, రవికుమార్, వై.వి.సుబ్బరావు పాల్గొన్నారు.

# రాజరాజేశ్వరి అమ్మవారి హుండీ లెక్కింపు

నెల్లూరు దర్గామిట్టలోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 1న హుండీ లెక్కింపు జరిగింది. ఆగష్టు7 నుంచి సెప్టెంబర్30 వరకు భక్తులు అమ్మవారికి ఇచ్చిన కానుకలు లెక్కించారు. హుండీల ద్వారా రూ.977189/- ఆదాయం రాగా ఆ మొత్తాన్ని బ్యాంకులో జమచేసారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు, దేవాదాయశాఖ సూపరిటెండెంట్ సుధాకర్, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు నరేంద్రప్రసాద్, తొండా నవమణి, దేవస్థాన ప్రధాన అర్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ, దేవాలయ సిబ్బంది మనోజ్, శ్రీదేవి, చెన్నయ్య, కృష్ణయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 13న బలిజ వివాహ పరిచయవేదిక

నెల్లూరు టౌన్‌హాలులో ఈ నెల 13న బలిజ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ సింహపురి ఆధ్వర్యంలో ఉచిత బలిజ, తెలగ, కాపు వివాహ పరిచయవేదిక నిర్వహించబడుతుంది. రిజిస్ట్రేషన్ కోసం రెండు ఫోటోలు తీసుకొని తల్లిదండ్రులతో కలసి సంప్రదించమని నిర్వాహకులు లక్కాకుల పెంచలయ్య, ఏకోజి కోటేశ్వరరావు, ఏకోజి మధుసూదన్‌రావు, అంచనాల నాగేశ్వరరావులు కోరుతున్నారు. వివరాలకు 93983 14847, 8500562001 నెంబర్లలో సంప్రదించమని తెలిపారు.

## సమైక్యాంధ్ర కోసం

# కోళ్ళ పరిశ్రమ వాహనర్యాలీ

సమైక్యాంధ్ర ఉద్యమానికి మద్దతుగా నెల్లూరు జిల్లా కోళ్ళ పరిశ్రమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబరు 30న నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ దగ్గర శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి ఆర్.టి.సి బస్టాండ్ వరకు వాహన ర్యాలీ జరిగింది. నెల్లూరు జిల్లా కోళ్ళ పరిశ్రమలోని రైతులు, మేతలు, మందుల వ్యాపారులు, చికెన్‌స్టాల్స్, చికెన్ ట్రేడర్స్, కోడిగుడ్ల వ్యాపారులు అందరూ తమ దుకాణాలు మూసేసి సమైక్యాంధ్ర కోసం వాహన ర్యాలీని జరిపారు. నెక్ మాజీజోనల్ ఛైర్మన్ ఎన్.బలరామయ్య నాయుడు ఈ ర్యాలీకి నేతృత్వం వహించారు.

# ఢిల్లీకి వెళ్ళిన సీమాంధ్ర బిజెపి నేతలు

సీమాంధ్ర ప్రజల మనోభావాలను జాతీయ నాయకులకు తెలియజేసేందుకు బిజెపి రాష్ట్ర నాయకులు ఈనెల 1న ఢిల్లీకి పయనమయ్యారు. నెల్లూరు నుంచి బిజెపి జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి నాయకత్వంలో బయలుదేరిన బృందం రాష్ట్ర పార్టీ నాయకులతో కలిసి ఢిల్లీకి వెళ్ళి సీమాంధ్ర ప్రజలను ఆందోళనలకు గురిచేస్తున్న అంశాలపై యుపిఏ ప్రభుత్వం పరిష్కారం చూపిన తరువాతే రాష్ట్ర విభజన బిల్లుకు బిజెపి మద్దతు పలకాలని లేని పక్షంలో బిల్లును వ్యతిరేకించాలని బిజెపి కేంద్ర నాయకులను కోరతారని బిజెపి జిల్లా కార్యాలయ కార్యదర్శి కిన్నెరకృష్ణమూర్తి ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఓట్లు, సీట్ల ప్రాతిపదికన ఏకపక్షంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిందని సీమాంధ్ర ప్రాంత ప్రజల అనుమానాలు, భయాందోళనలు నిజమేనని భారతీయ జనతా పార్టీ సీమాంధ్ర నాయకులు గ్రహించి, జాతీయనాయకులైన బిజెపి అధ్యక్షులు రాజ్‌నాథ్‌సింగ్, సీనియర్ నాయకులు అద్వాని, సుష్మాస్వరాజ్, అరుణ్‌జైట్లీ, వెంకయ్య నాయుడులకు ఈ విషయాలు తెలపాలని ఢిల్లీకి వెళ్లారన్నారు.

# రోడ్డు పక్క వ్యాపారులకు గుర్తింపు

రోడ్డు పక్క బుట్టలు, తోపుడు బండ్లు పెట్టుకొని వ్యాపారం చేసుకునే చిన్నా చితకా వ్యాపారులకు సుప్రీంకోర్టు ఊరట కలిగించిందని ఆంధ్ర ఛాంబర్ ఆఫ్‌కామర్స్ ఎ.పి & చెన్నై రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వి.చలమయ్య పేర్కొన్నారు. వీధి, వ్యాపారుల క్రమబద్ధీకరణ విధానం 2009ని పూర్తిగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించిందని తెలిపారు. మున్సిపాలిటీలు, పంచాయితీలలో తోపుడు బండ్లు వగైరాలపై వ్యాపారాలు చేసుకొనే వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నాలుగు నెలలలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించిందని తెలిపారు. అందువల్ల పోలీసు సిబ్బంది వీధి వ్యాపారులను వేధించకుండా, సహకార ధోరణిని ప్రదర్శించాలని కోరారు.

# రాక్షస జాతి

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతుంటే కనీసం వాటిని చల్లార్చే ప్రయత్నాన్ని కూడా కేంద్ర పెద్దలు చేయలేదు సరికదా అగ్నికి ఆజ్యం పోస్తూ, రగులుతున్న సీమాంధ్రుల గుండెలను మరింతగా మండిస్తూ 3వ తేదీన తెలంగాణపై కేబినెట్ నోట్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. సీమాంధ్రలో ఆందోళనలను కాని, ప్రజల భయాలను గాని కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. హైదరాబాద్‌పై సీమాంధ్రుల భయాలను తొలగించే ప్రయత్నం కూడా చేయలేదు. సిడబ్ల్యూసిలో ఏ తీర్మానం అయితే చేసారో కేబినెట్‌లో అదే ఆమోదించారు. తెలంగాణకు హైదరాబాద్‌ను రాజధానిగా ప్రకటించారు. 10ఏళ్ల మాత్రమే హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా చేసారు. 10ఏళ్ల తర్వాత సీమాంధ్రులు రోడ్డున పడాల్సిందే!

రాజీవ్‌గాంధీ సోనియాను పెళ్ళి చేసుకుని ఒక తప్పుచేస్తే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీని క్లోజ్ చేయకుండా గాంధీజీ కూడా సీమాంధ్ర పాలిట పొరపాటు చేసారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు కాంగ్రెస్‌ను గుండెల్లో పెట్టుకున్నారు. 1978లో దేశమంతా కాంగ్రెస్ కొట్టుకుపోయినా ఆంధ్రప్రదేశ్‌లో ఆదరించారు. 2004, 2009లో కేంద్రంలో యూపిఏ ప్రభుత్వం ఏర్పడడానికి కాంగ్రెస్‌కు మెజార్టీ సీట్లు అందించింది ఈ రాష్ట్రమే. ఈ ప్రజలు కాంగ్రెస్‌ను గుండెల్లో పెట్టుకుంటే సోనియాగాంధీ వారి గుండెలమీదే తన్నింది. నీతి, జాతి లేని సోనియా తెలుగు జాతికి తీరని ద్రోహం చేసింది. ప్రజాస్వామ్యం ముసుగులో నిరంకుశంగా వ్యవహరించిన సోనియా సీమాంధ్ర ప్రజల ఆకాంక్షలకు సమాధి కట్టింది. దీనికి కాంగ్రెస్ ఫలితం అనుభవించకతప్పదు. 'వినాశకాలే విపరీత బుద్ధి' అంటారు. కాంగ్రెస్‌కు ఘోరీ కట్టే రోజులు దగ్గరపడ్డాయి కాబట్టే కాంగ్రెస్ అధిష్టానం ఇంత మూర్ఖంగా వ్యవహరించింది. తెలంగాణ ప్రక్రియ మొదలైనట్లుగానే, కాంగ్రెస్‌కు సమాధి కట్టే ప్రక్రియ మొదలైందని చెప్పవచ్చు.

# కాంగ్రెస్ నావలోనే...

(2వ పేజీ తరువాయి)

చేయలేరు. కాంగ్రెస్‌లో వారికి రాష్ట్ర నాయకులనే గుర్తింపు వచ్చింది. కాంగ్రెస్ అధిష్టానం వద్ద కూడా కాంగ్రెస్ విధేయులనే ముద్ర పడింది. కాంగ్రెస్‌లో ఒక రేంజ్‌కు వెళ్ళారు. ఇంకో పదేళ్ళ తర్వాతయినా రాష్ట్రంలో కాంగ్రెస్ బ్రతికి బట్టకట్టిందంటే అప్పుడు పార్టీకి వాళ్లే పెద్ద నాయకులవుతారు. ఇప్పుడు వైకాపాలోకి పోయినా, తెలుగుదేశంలోకి వెళ్లినా మహా అంటే వాళ్లు మంత్రిస్థాయికి పోగలరు, ముఖ్యమంత్రి దాకా పోలేరుగా! అదీగాక జగన్‌ను, చంద్రబాబును బండబూతులు తిట్టివున్నారు. జగన్ పార్టీలోకి వాళ్లు రమ్మన్నారు. ఆత్మాభిమానం చంపుకుని వీళ్లు పోరు. చంద్రబాబు క్రింద పనిచేసే స్థాయికి వీళ్లు దిగజారలేరు. కాబట్టి కాంగ్రెస్‌లో వుండిపోవాల్సిందే! కాంగ్రెస్ విభజన నిర్ణయం వల్ల రాజకీయంగా వీరికీ నష్టమే. విభజన ప్రకటన రాకముందు ఆనం రామనారాయణరెడ్డికి ఆత్మకూరులో మంచి పేరు వచ్చింది. బాగా అభివృద్ధి చేసాదన్నారు. జగన్ ఇమేజ్‌కు అతీతంగా ఆత్మకూరులో ఆనంకు ఓట్లేసేలా వాతావరణం ఉండింది. నెల్లూరురూరల్‌లోనూ ఆనం వివేకా ప్రాబల్యం పనిచేసేది, కాని విభజన ప్రకటన తర్వాత ప్రజల్లో కాంగ్రెస్ అంటేనే విరక్తి వచ్చింది. అది ఆనం మీద కూడా పడుతోంది. కాంగ్రెస్ మమ్మల్ని ముంచినా మేం కాంగ్రెస్‌ను ముంచబోమంటున్నారు బ్రదర్స్. కాంగ్రెస్‌తో ఇప్పుడు మునిగినా ఏదో ఒకరోజు అదే తమను అత్యున్నత స్థానంలో నిలబెడుతుందని వారి నమ్మకం.

# ఏదీ తేల్చక...

(2వ పేజీ తరువాయి)

తెలంగాణను ప్రకటించింది, అయితే దీని మీద పురోగతి లేదు. హైదరాబాద్ మీద స్పష్టత లేదు. సీమాంధ్ర కొత్త రాజధాని ఏంటనేదాని మీద వివరణ లేదు. తెలంగాణ ఖాయమై, సీమాంధ్రకు కోస్తాతీరంలో ఏ నగరాన్ని రాజధానిగా ప్రకటించినా నెల్లూరుజిల్లాలో మళ్ళీ రియల్‌మార్కెట్ పుంజుకోవడం ఖాయం. కాని ఇంకా అనిశ్చితి కొనసాగుతుంది. కొత్త రాష్ట్రం, కొత్త రాజధానిపై కేంద్రం ఏదో ఒకటి తేల్చిపడేస్తే జిల్లాలో రియల్ వ్యాపారులు ఒడ్డునపడే అవకాశముంది.

# నిరుత్సాహం

(2వ పేజీ తరువాయి)

ఊపుమీదుంది. జగన్ ప్రభంజనం బలంగా వుంది. జిల్లాలో జరిగిన నెల్లూరు లోక్‌సభ, కోవూరు, ఉదయగిరి అసెంబ్లీల ఉపఎన్నికల ఫలితాలతోనే వైకాపా ఎంత జోరుమీదుందనేది తెలిసింది. ఇప్పుడు రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్, తెలుగుదేశంలను ప్రజలు దోషులుగా చూస్తున్నారు, జగన్ పూర్తిగా సమైక్యవాదం వైపు నిలవడంతో నిన్న మొన్నటిదాకా కాంగ్రెస్, తెలుగుదేశంలకు సానుభూతి పరులుగా వున్నవాళ్లు కూడా ఇప్పుడు వైకాపా వైపు చూస్తున్నారు.

# దీక్షాదక్షుడు

(మొదటిపేజీ తరువాయి)

మునుపటికన్నా కూడా పరిణితి కనిపిస్తుంది. ఆవేశం, అర్థరహిత విమర్శల జోలికి పోవడం లేదు. రాజకీయ ప్రత్యర్థులలో సైతం మంచి చెడులు గ్రహించే నైజం ఆయనలో కనిపిస్తుంది. నరేంద్ర మోడీని మంచి పరిపాలనాదక్షుడిగా మెచ్చుకున్న జగన్ ఆయనలోని మతతత్వాన్ని మాత్రం ఖండించారు. కాంగ్రెస్‌తో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాడంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలను సైతం ఆయన సున్నితంగానే తిప్పికొట్టారు. గురువారం టి-నోట్‌ను కేబినెట్ ఆమోదించినప్పుడు కూడా ఆయన ఎంతో ఆవేదనతో స్పందించిన తీరు తెలుగుప్రజల మనసులను హత్తుకుంది. సీమాంధ్రలోని 175నియోజకవర్గాలలో సమైక్య ఉద్యమానికి జగన్ ఊపిరూదాడు. ఓ పక్క ఎన్జీఓలు మరోపక్క వైకాపా శ్రేణులు ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నాయి. ప్రజలు ఉక్కు సంకల్పంతో ఉద్యమిస్తే సోనియా కాదు ఇటలీ నుండి ఆమె జేజమ్మ అయినా దిగిరావాల్సిందే!

# వెంటపడ్డాడు

(మొదటిపేజీ తరువాయి)

విషయం చంద్రబాబుకు అర్థమైంది. ఎలాగూ ముస్లింల ఓట్లు పెద్దగారావు. కాని యువకులు, విద్యావంతులు మోడీవైపు ఆకర్షితులవుతున్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకుంటే మోడీ సానుకూల ఓటును తమ పార్టీకి కూడా పడేలా చేసుకోవచ్చుననేది ఆయన ఆలోచన. 2వ తేదీ ఢిల్లీలో ఆయన మోడీతో కలిసి ఒకే వేదికను పంచుకున్నాడు. మోడీని పదేపదే పొగిడాడు. 1999లో వాజ్‌పేయి ఇమేజ్ రాష్ట్రంలో చంద్రబాబుకు కలిసివచ్చింది. ఈసారి కూడా అటువంటి లక్కు దక్కుతుందేమోనని, మోడీ రూపంలో అదృష్టం తన ఇంటి కాలింగ్‌బెల్ నొక్కుతుందేమోనని బాబుగారి ఆశ.



# వేమిరెడ్డి వితరణ

ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మరోసారి తన దాతృత్వాన్ని చాటారు. సామాజిక కార్యక్రమాల్లో తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారానికి జెరాక్స్‌మిషన్, రెండు ప్రింటర్లు, ఏసీ మిషన్లు వితరణ చేసారు. ఖైదీలు సత్ప్రవర్తనను అలవర్చుకుని, సమాజంలో మంచి పౌరులుగా మెలగాలని వేమిరెడ్డి ఆకాంక్షిస్తూ సందేశం పంపారు. జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ రామకృష్ణ, జిల్లా సెషన్స్ జడ్జి కనకదుర్గారావు, కేంద్ర కారాగార సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ కార్యదర్శిగా 'తిరువీధి ప్రకాశరావు'

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి నిరంతరాయంగా కృషి చేస్తూ జిల్లా స్థాయి నుంచి, రాష్ట్ర స్థాయి వరకు అనేక పదవులు నిర్వహించిన తిరువీధి ప్రకాశరావు అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ఆర్య వైశ్య కార్యదర్శిగా వైశ్యులకు విస్తృతస్థాయి సేవలందించే భాగ్యం తమకు లభించడం ఎంతో ఆనందంగా వుందని, ఈ పదవీ బాధ్యతల్ని తనకు ఇచ్చిన ప్రధానకార్యదర్శి శ్రీ గంజి రాజమౌళి గుప్తా గారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన 2015 వరకు ఈ పదవిలో కొనసాగుతారు.

## వికలాంగ మహిళలకు 'క్రాంతి' చేయూత



నెల్లూరులోని క్రాంతి మహిళ మండలి ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం నెల్లూరు పడారుపల్లి పిసినగర్ కాలనీ ఆచార్య పిసి రెడ్డి సమాజ మందిరంలో వికలాంగ మహిళలకు ఉపాధి కొరకు 4 కుట్టుమిషన్లను నెల్లూరు జిల్లా జాయింటు కలెక్టర్ బి.లక్ష్మీకాంతం చేతులమీదుగా వికలాంగ మహిళలకు అందజేశారు. గాంధీ విగ్రహానికి పి.జ్యోతి, వాస్తు రామచంద్రరావు, వొమ్మిన సుబ్రహ్మణ్యం, ఇవియస్ నాయుడు, ఆర్.లక్ష్మి, కుసుమకుమారి, కొమ్మి శంకరనాయుడు, వై.యానాదయ్య, వెంకయ్య పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధి కేంద్రం నిర్మాణం కొరకు పి.జ్యోతి 5వేల రూపాయలు, కొమ్మి శంకనాయుడు 5వేల రూపాయలు విరాళంగా అందజేసారు. మురళీకృష్ణ హోటల్స్ ఎండి హజరత్‌బాబు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని క్రాంతి మహిళ మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## ఓటు హక్కుపై నా నిక్కువాక్కు

ఓటు హక్కు వినియోగించుకోని వారికి 'ప్రభుత'ను విమర్శించే హక్కు లేదు. ఎం.పిలను ఎన్నుకునేది కూడా మనమేగనుక, మన రాష్ట్రంలోనే కాదు, దేశంలోని ఏ నేతనైనా నిందించే నిక్కులేదు. ఏ సహాయం అందకున్నా దెబిరించే దిక్కు లేదు. నమోదుచేసుకున్న ఓటును, ఎన్నికల తరుణంలో ఎవరేని, తీసేసినా, అప్పటికే దొంగోటు వేసి వెళ్ళియున్న(స్వార్థ రాజకీయ టక్కుటమారటెక్కు చిత్తుల వారి వల్ల)ట్లయితే దప్ప.

అట్టిది, దేశ తొలిపౌరుని ఎన్నికలప్పుడు, గౌ॥ ప్రణబ్‌ముఖర్జీ గారికి ఓటు వేయవద్దని బహిరంగంగా చెప్పిన చంద్రబాబు గారు, ఇటీవల చి॥ జగన్‌కు బెయిల్ రాకుండేందుకౌ గౌ॥ రాష్ట్రపతిని కలిశొచ్చాదు. సిగ్గుందా? ఏం చేద్దాం?! ముతకవయస్సు పాతక మనస్సు.



డా॥ పెళ్ళకూరు జె.పి.రెడ్డి
MBBS FSI FIC (USA)
చర్మ & తొలిసెక్సాలజిస్ట్
రైలుకట్టవీధి, పొగతోట, నెల్లూరు.
మంగు, బొల్లికై - 0861 - 2333666.




# శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానము

దుర్గామిట్ట, నెల్లూరు - 4. ఫోన్: 2322016, 2345676.

## 39వ శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవ సమాహ్వానము

తేది 05-10-2013 నుండి తేది 13-10-2013 వరకు

### బ్రహ్మోత్సవ ప్రత్యేక ఆర్జిత సేవలు

| | |
|---|---|
| సహస్ర నామము | - 10 రోజులు రూ.500/- |
| శ్రీదేవి ఖడ్గమాల | - 10 రోజులు రూ.250/- |
| అష్టోత్తర పూజ | - 10 రోజులు రూ.100/- |
| సామూహిక సవావరణం | - 1రోజు రూ.1000/- |

తేది.13-10-2013 (విజయదశమి)రోజు మహాభిషేకం రూ.250/-
పై పూజలు చేయించుకొనువారు ముందుగా రొఖ్ఖము ద్వారా లేదా డి.డి. ద్వారా చెల్లించి రసీదు పొందవలెను.

### ఉత్సవ కార్యక్రమములు

| | | |
|---|---|---|
| తేది.09-10-13 మంగళవారము | శ్రీ గజలక్ష్మి అలంకారము | శ్రీ పొట్టిపాటి ద్వారకానాథ్ గారు, ఛైర్మెన్, నిపోక్స్, నెల్లూరు. |
| తేది.10-10-13 బుధవారము | శ్రీ సరస్వతి అలంకారము | శ్రీ బండారు మధుసూధనరెడ్డి - రజని గార్లు, అమెరికా |
| తేది.11-10-13 గురువారము | శ్రీ కాళికా అలంకారము | శ్రీ చెన్నారెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డి - రంజిత గార్లు, నెల్లూరు. |
| తేది.12-10-13 శనివారము ఉ॥ | శ్రీ దుర్గా అలంకారము | శ్రీ రావులపల్లి వెంకటరామానాయుడు - సులోచనమ్మగార్లు, నెల్లూరు. |
| తేది.12-10-13 శనివారము సా॥ | శ్రీ మహిషాసురమర్ధిని | ఆనం అమ్మణమ్మ జ్ఞాపకార్థం శ్రీ ఆనం గోపాలకృష్ణారెడ్డి, హైదరాబాద్. |
| తేది.13-10-13 ఆదివారము (దశమి) | శ్రీ రాజరాజేశ్వరి అలంకారము | శ్రీ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి - సులోచనమ్మ గార్లు, నెల్లూరు. |

**నగరోత్సవం:** విజయదశమి నాడు రాత్రి గం.10-00ని.లకు మిరుమిట్లు గొలిపే బాణాసంచాలతో ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలంకరణతో, మహిషాసురమర్ధనీ విచిత్ర వేషధారణతో, తప్పెట్లు, కోలాటముతో, పండరీ భజనంతో, తెనాలి బ్యాండ్ కచ్చేరితో మంగళకర వాయిద్యములతో, వేద మంత్రోచ్చారణములతో శ్రీ అమ్మవారి నగరోత్సవము అత్యంత వైభవముగా జరుపబడును. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరు.

**అన్నదానం:** తేది 14-10-2013 సోమవారం మధ్యాహ్నం 12.00గం.లకు శ్రీ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి - శ్రీమతి సులోచనమ్మ, ఆల్తూరు గిరీష్-లత, ఆల్తూరు మహేష్-రాధిక వారి సౌజన్యముతో...

సదా అమ్మవారి సేవలో... భవదీయులు

**రత్నం జయరామ్**
వ్యవస్థాపక కుటుంబ సభ్యులు మరియు ఛైర్మెన్ & ధర్మకర్తల మండలి

**పాయసం నాగేశ్వరరావు** M.A.,
సహాయ కమీషనరు మరియు కార్యనిర్వాహణాధికారి

# గూడూరు డివిజన్ వార్తలు

## నాశిన నాగులుకు వైకాపా పట్టణ బాధ్యతలు



నాగులును సన్మానిస్తున్న మేరిగ మురళీధర్

వైయస్సార్సీపీ గూడూరు పట్టణ అధ్యక్షుడుగా నాశిన నాగులును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సోమవారం గూడూరులోని వైయస్సార్సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి నివాసంలో పార్టీ నాశిన నాగులుకు అభినందనసభ జరిగింది. వైయస్సార్సీపీ జిల్లా కన్వీనర్ మేరిగ మురళీధర్ నాగులును సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి వైయస్సార్సీపీలో గుర్తింపు వుంటుందన్నారు. క్రమశిక్షణతో పనిచేసే నాగులుకు పార్టీ సముచిత స్థానం కల్పించిందన్నారు. రాష్ట్ర విభజనపై అటు కాంగ్రెస్, ఇటు టీడీపీలు ద్వంద్వవైఖరి అవలంభిస్తున్నాయన్నారు. సమైక్యవాదానికి కట్టుబడివున్న ఏకైక పార్టీ వైయస్సార్సీపీయేనన్నారు. సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ మరణం తర్వాత కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. మొదటి నుంచి వైయస్సార్సీపీ సమైక్యవాదానికి కట్టుబడి వుందని, రాష్ట్ర విభజన ప్రక్రియ వెలువడక ముందే వైయస్సార్సీపీ ఎంపి, ఎమ్మెల్యేలు రాజీనామాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లు విజయకుమార్‌రెడ్డి, గూడూరు రాజేశ్వరరెడ్డి, మెట్టు రాధాకృష్ణారెడ్డి, పరుచూరు సుబ్రహ్మణ్యం, నెల్లబల్లి భాస్కర్‌రెడ్డి, మధురెడ్డి, మాజీకౌన్సిలర్లు ఎంబేటి చంద్రయ్య, బొమ్మిడి శ్రీనివాసులు, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, గిరి, సేదు మోహన్, కరీముల్లా, బుజయ్యనాయుడు, చిరంజీవి, మల్లిగాడ్, తదితరులు పాల్గొన్నారు.

## దేవాంగుల వినూత్న నిరసన



మగ్గం నేస్తూ నిరసన తెలుపుతున్న దేవాంగులు

గూడూరురూరల్ పరిధిలోని చెన్నూరుగ్రామం నుంచి పలు వాహనాల్లో దేవాంగులు గూడూరుకు తరలివచ్చారు. టవర్‌క్లాక్ కూడలి వద్ద దేవాంగులు మగ్గం నేస్తూ వినూత్న రీతిలో సమైక్యాంధ్రకు మద్దతుగా తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు, దేవాంగ సంఘనాయకులు మాట్లాడుతూ యూపిఏ ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని ముక్కలు చేసిందన్నారు. దీంతో సీమాంధ్ర ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు ఎంతో ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. రాష్ట్ర విభజన జరిగితే సీమాంధ్ర ప్రాంతానికి తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఎన్నో ఇబ్బందులు పడవలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మస్తానయ్య, రాజేంద్రప్రసాద్, జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఓబులేసు, చంద్రశేఖర్, శేషాద్రిరాజు, రామరాజు, నీలం రాజారెడ్డి, విజయకుమార్, భాస్కర్, రాఘవయ్య, మేకుల రవిచంద్ర, దేవాంగ సంఘనాయకులు నవశేఖర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 2వ తేదీన గాంధీ జయంతి సందర్భంగా నేదురుమల్లి పద్మనాభరెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో గూడూరులో నిర్వహించిన దీక్షాశిబిరంలో కూర్చున్న గూడూరు వైయస్సార్సీపీ సమన్వయకర్తలు డా॥ బాలచెన్నయ్య, పాశం సునీల్‌కుమార్, గూడూరు వైయస్సార్సీపీ నాయకులు బత్తిన విజయకుమార్ తదితరులు

## 60రోజులే కాదు 600రోజులైనా...
# ఆందోళనలు కొనసాగిస్తాం



దీక్షా శిబిరంలో గూడూరు జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శివకుమార్, జేఏసీ నాయకులు మస్తానయ్య తదితరులు

సమైక్య ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమయ్యిందని, కార్యాచరణ రూపొందిస్తున్నామని సమైక్యాంధ్ర సాధనకు 60రోజులే కాదు 600రోజులైనా ఆందోళనలు కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. గత నెల 29న పలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. జేఏసీ నాయకులు మస్తానయ్య, అయితా కమలాకర్, పిచ్చుక వెంకటరమణ, వెంకటేశ్వర్లు, వై.వి.నారాయణ, రవిచంద్ర, ఫిరోజ్‌ఖాన్, అక్కన రమణయ్య, గూడూరు జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శివకుమార్ మరియు జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కె.చంద్రశేఖర్ తదితరులు దీక్షాశిబిరంలో పాల్గొన్నారు. అనంతరం జర్నలిస్టులతో కలసి గోలీలాటలు, రోడ్లపై నృత్యాలు, సమైక్యనినాదాలతో ఆందోళనలు కొనసాగించారు. ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో సాధుపేట మదీనామసీదు నుంచి ప్రదర్శనగా టవర్‌క్లాక్ కూడలి చేరుకున్నారు. టవర్‌క్లాక్ వద్ద రోడ్లపై నమాజుచేసి సమైక్యాంధ్ర సాధనకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా గూడూరు జర్నలిస్టు సంఘ నాయకుడు ఎ.శివకుమార్, జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యమం 61వ రోజుకు చేరుకున్నా తీవ్రత కేంద్రప్రభుత్వానికి తెలియడంలేదన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమయిందని అన్నారు. అడుగడుగునా సమైక్య ఉద్యమానికి అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.


## ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ నూతన కార్యవర్గం



ఫోటో - నూతన కార్యవర్గసభ్యులతో డీఎస్పీ కె.చౌడేశ్వరి

గూడూరు పట్టణ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం 2013–14కు గాను ప్రమాణస్వీకారం గత నెల 29న అంబేద్కర్‌భవన్‌లో జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా గూడూరు డీఎస్పీ కె.చౌడేశ్వరి పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్ఞాపకాలను పదిలపరచుకునేందుకు ఫోటోలు, వీడియోలు ఎంతో దోహదపడుతాయన్నారు. అలాంటి చిత్రాలను కళాత్మకంగా తీసే ఫోటో, వీడియోగ్రాఫర్లు మంచిగుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్లను సన్మానించారు. నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కె.మునిగిరీష్, డివిజన్ అధ్యక్షుడు కందునూరు కోటేశ్వరరావు, గజానన, నూతన అధ్యక్షులు చెన్నుపల్లి ప్రభాకర్, ఉపాధ్యక్షులు కృష్ణాపట్నం రవి, కార్యదర్శి జి.విజయరత్నం, సంయుక్త కార్యదర్శి యస్.కె.ఖాదర్, కోశాధికారి యల్.సతీష్ మరియు గూడూరు, రాపూరు, సూళ్లూరుపేట, కోట ప్రాంతాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

### జిల్లా క్రికెట్ అసోసియేషన్
## ఈసీ మెంబరుగా మునిగిరీష్



జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఈసీ మెంబరుగా గూడూరుకు చెందిన కొణిదల మునిగిరీష్‌ను ఎంపిక చేశారు. జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన అసోసియేషన్ సరసభ్య సమావేశంలో పాతికేళ్లుగా గూడూరు క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తున్న మునిగిరీష్‌ను ఈసీ మెంబరుగా నియమిస్తూ తీసుకున్న నిర్ణయానికి సభ్యులు ఆమోదం తెలిపారని గూడూరు క్రికెట్ క్లబ్ పేర్కొంది. ఆదివారం నాడు గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మునిగిరీష్ మాట్లాడుతూ పాతికేళ్ల కృషికి ఫలితం దక్కిందన్నారు. జిల్లా అసోసియేషన్‌లో గూడూరు క్రికెట్‌క్లబ్ సభ్యత్వాన్ని ఇవ్వడమే కాకుండా తనను ఈసీ మెంబరుగా ఎన్నుకునందుకు కలెక్టర్‌కి, కార్యదర్శి శ్రీనివాసులురెడ్డికి, మిగిలిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### వెస్ట్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో
## గుండెపై అవగాహన సదస్సు

గూడూరు వెస్ట్ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నెల్లూరు బొల్లినేని ఆసుపత్రి గుండె వైద్య నిపుణుడు సి.ఎస్.శ్రీనివాసరాజు గుండెపై అవగాహన కల్పించారు. స్థానిక రోటరీ భవనంలో ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ శరీరంలో అతిముఖ్యమైన అవయవం గుండేనని, దానికి వచ్చే జబ్బులపై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి వుండాలని అన్నారు. మానవ శరీరంలో అతిముఖ్యమైన అవయవం అయిన గుండెకు ఎలాంటి చిన్న ఇబ్బంది కలిగినా ప్రాణానికే ప్రమాదమన్నారు. గుండె పనిచేసే విధానాన్ని పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు రోటరీ వెస్ట్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు విద్యా సాగర్‌రావు, వాసు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాయూరి శ్యాం మాదవ్, డాక్టర్ సి.ఆర్.రెడ్డి, సి.జనార్ధన రెడ్డి, కె.సుందరరామిరెడ్డి, మెహర్మణి వై.గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శ్రద్ధాంజలి



మంచికి మారుపేరుగా నిలిచి
మమతానురాగాలతో
మా అందరి హృదయాలలో
చెరగని ముద్రవేసిన
శ్రీ వేగూరు శ్రీనివాసులురెడ్డి గారి
మరణంపట్ల చింతిస్తూ...
వారి ఆత్మశాంతికై భగవంతుని
ప్రార్థిస్తూ.. వారి కుటుంబ
సభ్యులకు మా ప్రగాఢ
సానుభూతిని తెలియజేస్తూ...

శ్రీ వేగూరు శ్రీనివాసులురెడ్డి గారు
జననం: 30-4-1964
మరణం: 25-9-2013

| | | |
|---|---|---|
| Dr.S.R.K EM High School | Little Angels EM High School | New Vidya Bharathi EM High School |
| Modern EM High School | Vedavyasa EM High School | Sanghamitra EM High School |
| Sri Nethaji (MSR) EM High School | L.L.F. EM High School | Vikas EM High School |
| Sri Sarada EM High School | Silpa EM High School | Raghava EM High School |
| Mythylee EM High School | Geethanjali EM High School | Vijayakrishna EM High School |

PDF Compressor Free Version



## రాష్ట్రం రెండుగా...
# కాంగ్రెస్ మూడుగా...





- సీమాంధ్రలో రెండు వర్గాలుగా విడిపోయిన కాంగ్రెస్ నేతలు
- ముఖ్యమంత్రి పదవి కోసం మొదలైన పైరవీలు
- తెలంగాణ నోట్ నేపథ్యంలో నేతల మధ్య మల్ల గుల్లాలు

అధికారపక్షం, విపక్షం, విమర్శలు, ప్రతి విమర్శలు, దాడులు, ఎదురుదాడులు... ఇవన్నీ కూడా ఇప్పుడు రాష్ట్రంలో ఒక్క కాంగ్రెస్ పార్టీలోనే కనిపించేస్తున్నాయి. సిడబ్ల్యూసి విభజన ప్రకటన రాష్ట్ర ప్రజల మధ్యే కాదు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల మధ్య కూడా చిచ్చుపెట్టింది. అయితే నిన్నటివరకు ఈ చిచ్చు సీమాంధ్ర, తెలంగాణ నాయకుల మధ్యే వుండింది. కాని ఇప్పుడు సీమాంధ్ర కాంగ్రెస్‌నేతల మధ్యే ఈ చిచ్చు అగ్నిపర్వతాన్ని తలపించేలా వుంది.

రాష్ట్ర విభజనపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎం కిరణ్ అనుచరులు ఒక వర్గంగా ఏర్పడితే, సిడబ్ల్యూసి నిర్ణయాన్ని గౌరవిస్తూ రాష్ట్ర విభజనను వ్యతిరేకించే వర్గంగా పీసీసీ చీఫ్ బొత్స, మంత్రి ఆనం, మరికొంతమంది మంత్రులు కూటమి కట్టారు.

కాంగ్రెస్ అధిష్టానంతో తాడోపేడో తేల్చుకునే దిశలో కిరణ్ వున్నారు. రాష్ట్ర విభజన ప్రకటనకు ముందే కిరణ్ ఢిల్లీ వెళ్లి అధిష్టానానికి తన అభిప్రాయాలు చెప్పి వచ్చారు. రాష్ట్రాన్ని విభజిస్తే వచ్చే సమస్యల గురించి కూడా ఆయన పూసగుచ్చినట్లు చెప్పి వచ్చాడు. కాని అధిష్టానం ఆయన మాటలను లెక్కలోకి తీసుకోలేదు. తమ సీట్లు, ఓట్లు చూసుకుని రాష్ట్ర విభజన ప్రకటన చేసింది. ఇది కిరణ్‌కు మింగుడుపడలేదు. సిడబ్ల్యూసి నిర్ణయంపై ఆయన కొన్నిరోజులు మౌనం దాల్చారు. 9రోజుల తర్వాత విభజన ప్రకటనపై స్పందించారు. రాష్ట్ర విభజనతో తలెత్తే సమస్యలను పరిష్కరించకుండా ఎలా ముందుకెళ్తారని ప్రశ్నించారు. సిడబ్ల్యూసి నిర్ణయం శిలాశాసనం కాదని, మరి అది శిలాశాసనమైతే నెహ్రూ, ఇందిరలు రాష్ట్రాన్ని కలుపుతూ చేసిన శాసనాలు మరణశాసనాలా? అంటూ ప్రశ్నించారు.

కిరణ్ వైఖరితో కాంగ్రెస్ అధినాయకత్వం గొంతులో వెలక్కాయ పడ్డట్లయ్యింది. విభజన ప్రకటనపై కిరణ్ అధిష్టానాన్నే నిలదీసారు. ఈ విషయంలో ఆయన సమైక్యాంధ్రహీరో అయ్యారు. విభజనను వ్యతిరేకించే కొందరు మంత్రులు ఆయనతో చేతులు కలిపారు.

అయితే కాంగ్రెస్ అధిష్టానాన్ని ధిక్కరిస్తూ కిరణ్ ఒక్కడే సమైక్యాంధ్ర ఉద్యమాన్ని నడుపుతున్నట్లుగా సీన్‌క్రియేట్ కావడం, తమను విలన్లుగా ప్రజలు చూడడం కాంగ్రెస్‌లోని ఇతర నేతలకు మింగుడుపడడం లేదు. వీళ్లంతా కూటమిగా ఏర్పడ్డారు. కాంగ్రెస్‌కు విధేయత వహిస్తూనే రాష్ట్ర విభజనను వ్యతిరేకించే వర్గంగా ఆనం రామనారాయణరెడ్డి, బొత్స సత్యనారాయణ, మరికొందరు మంత్రులు ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. అధిష్టానం ఆశీస్సులతోనే వీరు రాష్ట్రంలో కిరణ్‌కు వ్యతిరేకంగా రాజకీయాలు నడుపుతున్నారు. సీఎంగా కిరణ్ వుంటే విభజనపై కాంగ్రెస్ ముందుకు పోలేక పోతుంది. కిరణ్‌ను మార్చడమో లేక రాష్ట్రపతి పాలన విధించడమో చేయాలి. కిరణ్‌ను మార్చాల్సివస్తే కొత్త ముఖ్యమంత్రిగా ఆనం రామనారాయణరెడ్డికి ఎక్కువ అవకాశాలున్నాయి. ఆ తర్వాత రఘువీరారెడ్డి కూడా రేస్‌లో వున్నారు. కాని కిరణ్‌ను తప్పించాల్సిన అవసరమే వస్తే రాష్ట్రపతి పాలనకే అవకాశాలు ఎక్కువ. ఒకవేళ శాసనసభ తీర్మానం ఇప్పుడే అవసరమైతే కిరణ్ స్థానంలో ఆనంను లేదా రఘువీరాను కూర్చోబెట్టి అసెంబ్లీని సమావేశ పరిచే అవకాశముంది. అయితే గురువారం కేంద్ర కేబినెట్ తెలంగాణ నోట్‌ను ఆమోదించడంతో రాష్ట్ర రాజకీయాలే తారుమారయ్యే పరిస్థితి ఏర్పడింది. సీఎం కుర్చీపై ఇతర నేతలు పెట్టుకున్న ఆశలు వొమ్మవుతున్నాయి. అసలు కాంగ్రెస్‌లో వుండే పరిస్థితే లేకుండా పోయింది. తెలంగాణ నోట్‌ను కేంద్ర కేబినెట్ ఏకపక్షంగా ఆమోదించడంతో సీమాంధ్ర కాంగ్రెస్ నేతలంతా ఆ పార్టీకి గుడ్‌బై చెబుతున్నారు. కేంద్రమంత్రులు, ఎంపీలు, రాష్ట్రమంత్రులు, శాసనసభ్యులు రాజీనామా బాట పట్టారు. పరిస్థితి ఇంత ఉధృతంగా వుంటే ఈ సమయంలో ఈ సీఎం కుర్చీ ఎక్కాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. ఇలాంటి మూర్ఖత్వానికి ఏ నాయకుడు ఒడిగడతాడో చూడాలి!

# శ్రద్ధాంజలి



15-11-1928 25-09-2013

## శ్రీమతి గునుపాటి బుజ్జమ్మ గారు

స్వర్గీయ శ్రీ జి.కె.రెడ్డి గారి సతీమణి

మాకు దైవ సమానురాలైన మీరు దైవ సన్నిధికి చేరుకున్నా
మీ ఆశీస్సులు ఎల్లప్పుడూ మాకు వుండాలని కోరుకుంటూ
మీ ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తున్నాం ...!

| కుమార్తెలు | అల్లుళ్ళు |
|---|---|
| శ్రీమతి టి.ఇందిరారెడ్డి | శ్రీ టి.సుబ్బరామిరెడ్డి, MP |
| శ్రీమతి హైమావతిరెడ్డి | శ్రీ ఎ.వసంతకుమార్‌రెడ్డి |
| శ్రీమతి ప్రతిమరెడ్డి | లేట్ శ్రీ మోహన్‌రెడ్డి |
| **కుమారుడు** | **కోడలు** |
| శ్రీ గునుపాటి శివప్రసాద్‌రెడ్డి | శ్రీమతి రజనిరెడ్డి |

## గునుపాటి కుటుంబసభ్యులు

మరియు మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు, మునిమనుమరాళ్ళు

పింకి - సంజయ్‌రెడ్డి సరిత - సందీప్‌రెడ్డి

దీప్తి - సతీష్‌రెడ్డి నిత్య - హర్షవర్ధన్‌రెడ్డి రోహిత్‌రెడ్డి ఈషానీరెడ్డి

## పెద్దకర్మ

తేది.05-10-2013 శనివారం, మధ్యాహ్నం 12.30 నుండి
హోటల్ పార్క్ హయత్, బంజారాహిల్స్, హైదరాబాద్ నందు జరుగును.

Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323455. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.